

భక్తజనుల వాడ..గోవిందా!



వాడపల్లి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు బ్రహ్మాండంగా సాగుతున్నాయి.. పెద్ద ఎత్తున భక్తజనం హాజరై స్వామిని దర్శించుకుంటున్నారు.. సోమవారం రాత్రి యోగనారసింహ అలంకరణలో శ్రీవారు ముస్తాబై సింహ వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. వాహన సేవలో పాల్గొన్న భక్తులు గోవిందా.. గోవింద అంటూ నామస్మరణ చేశారు. విద్యుత్‌కాంతుల మధ్య ఊరేగింపు అంగరంగ వైభవంగా సాగింది.

జిల్లావ్యాప్తంగా భారీవర్షం

» లోతట్టు ప్రాంతాలు జలమయం

కాకినాడ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదివారం అర్ధరాత్రినుంచి సోమవారం ఉదయం వరకు కురిసిన భారీవర్షంతో జిల్లా లోని లోతట్టుప్రాంతాలు జలమయమయ్యాయి. ఎడతెరిపిలేకుండా కొన్నిగంటలపాటు కురిసిన వానకు జనజీవనం స్తంభించింది.స్కూళ్లు, కళాశాలలకు వెళ్లే సమయంలో వాన పడడంతో విద్యార్థులు వర్షంలోనే పాఠశాలలకు వెళ్లారు. జడివానతో కాకినాడనగరం తడిసిముద్దయ్యింది. మెయిన్‌రోడ్డు, రామకృష్ణారావుపేట, నూకాలమ్మగుడి, రామారావుపేట, సాంబమూర్తినగర్, గొడారిగుంట, డెయిరీఫామ్ సెంటర్‌ల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. కలెక్టరేట్ వెనుక పీజీఆర్ఎస్ కేంద్రంవద్ద వర్షం నీరు భారీగా నిలిచిపోయింది.జిల్లాలో 467.0 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా పిఠాపురంలో 65.4 మిల్లీమీటర్లు, యు.కొత్తపల్లిలో 60.4, పెదపూడిలో 43.6, తొండంగిలో 43.0, జగ్గంపేటలో 37.8, కరపలో 37.4, పెద్దాపురంలో 33.6, కాకినాడ అర్బన్‌లో 28.4, సామర్లకోటలో 25.2, గండేపల్లిలో 20.4, తాళ్లరేవులో 15.6, గొల్లప్రోలు, కాకినాడ రూరల్‌ల్లో 14.2, కాజులూరులో 12.4, ప్రత్తిపాడులో 8.0, కిర్లంపూడిలో 7.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.



పిఠాపురం పట్టణంలో కుండపోతగా కురుస్తున్న వర్షం



సముద్రంలో తేలిన విష రసాయనాల తెట్టు

పవన్.. పనిలో దిగారు!

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

» అరబిందో,దివిస్ ఫార్మావ్యర్థం..తేల్చేద్దాం
» కాలుష్యంపై ఏపీపీసీబీ అధ్యయనం
» ఉప్పాడ మత్స్యకారులకు పవన్ హామీ
» అధికారుల ఉరుకులు..పరుగులు
» నీరి,నియో, ఏయూలతో చర్చలు
» మూడు కన్సల్టెంట్లతో సంప్రదింపులు
» ఫార్మా వ్యర్థజలాల నమూనాల సేకరణ

అరబిందో,దివిస్ ఫార్మా వ్యర్థ జలాలతో సముద్ర జలాలు ఏ స్థాయిలో కలుషితం అవుతున్నాయో తేల్చడానికి అధికారులు కసరత్తు ప్రారంభించారు. తీరం నుంచి ఎంత వరకు సముద్ర జలాల్లో రసాయనాలు కలుస్తున్నాయనేది నిగ్గు తేల్చబోతున్నారు.సముద్ర కాలుష్యంపై వంద రోజుల్లో సమస్య పరిష్కారానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉప్పాడ మత్స్యకారులను ఇటీవల గడువు కోరిన నేపథ్యంలో అధికారులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.ఏపీపీసీబీ అధికారులు స్వతంత్ర సంస్థలను రంగంలోకి దించబోతున్నారు.ఈ మేరకు దేశంలోనే పేరున్న నీరి,నియో, ఏయూ నిపుణులతో మాట్లాడుతున్నారు. సముద్రంలో కలిసే కాలుష్యాన్ని నిగ్గు తేల్చడంతో ఈ మూడింటికి మంచి పేరుంది. వీటిలో ఎవరికి బాధ్యతలు ఇవ్వనున్నారనేది త్వరలో తేలనుంది.

పవన్ వచ్చారు.. హామీ ఇచ్చారు..

అరబిందో, దివిస్ కంపెనీలు సముద్రంలో 2.3 కిలోమీటర్లమేర పైపులైన్లు నిర్మించి ఫార్మా వ్యర్థాలను నీటిలో వదులుతున్నాయి. దీంతో తమకు వేట దొరకడం లేదని ఉప్పాడ మత్స్యకారులు ఆందోళన చేస్తు న్నారు. తమకు పరిహారం ఇప్పించాలని కోరుతూ గత నెల 23 నుంచి కొన్ని రోజుల పాటు ఆందో ళనకు దిగారు. జిల్లా కలెక్టర్ చర్చలకు వెళ్లినా డిప్యూటీ సీఎం పవన్ వచ్చి తమ సమస్యలను వినాలని డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం పవన్ కల్యాణ్ కాకినాడ కలెక్టరేట్‌లో మత్స్యకార సంఘాలతో చర్చించారు. అదే రోజు సాయంత్రం ఉప్పాడ సభలో ప్రసంగించారు. సముద్రంలో ఫార్మా వ్యర్థ జలాల కాలుష్యంపై ఆడిట్ నిర్వహిస్తామని వంద రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. పవన్ శనివారం అమరావతిలో పీసీబీ అధికారులు, జిల్లా కలెక్టర్‌తోను చర్చించారు. అసలు సముద్రంలో ఫార్మా వ్యర్థ జలాలు ఏ మేరకు కలుస్తున్నాయి? కాలుష్య ప్రభావం ఎంత? మత్స్యకారుల వేటపై ప్రభావం చూపుతుందా? లేదా? అనే దానిపై అధ్యయనం చేయించే విషయమై చర్చించారు. దేశంలో ప్రముఖ సంస్థలతో ఈ పని చేయించాలని తేల్చారు. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ (నీరి), నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఓషనోగ్రఫీ, ఆంధ్రా యూనివర్సిటీ మెరైన్ లివింగ్ రిసోర్స్ విభాగం వీటిలో ఎవరైతే మేలనే దానిపై చర్చించారు.ఈ మూడింటి వద్ద సముద్ర కాలుష్యంపై అధ్యయనం చేసే సాంకేతికత ఉందని అధికారులు పవన్‌కు వివరించారు.ఈ మూడింటితోను అధికారులు ప్రస్తుతం చర్చలు జరుపుతున్నారు. త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

వ్యర్థాల సంద్రమై..

కాకినాడ సెజ్ పరిధిలో తొండంగి మండ లంలో అరబిందో సంస్థ లైఫియస్ ఫార్మా కం పెనీని 2024లో ప్రారంభించింది. రూ.2,500 కోట్ల పెట్టుబడితో ఏటా 15 వేల మెట్రిక్ టన్నుల పెన్సిలిన్, 1.80 లక్షల మెట్రిక్ టన్నుల గ్లూకోజ్ ఉత్పత్తి చేసే సామర్థ్యంతో కంపెనీ స్థాపించింది. ప్రస్తుతం ఏడాదికి 15 శాతం మాత్రమే ఉత్పత్తి చేస్తోంది.ఈ క్రమంలో విడుదలయ్యే ఫార్మా వ్యర్థజలాలను సముద్రంలోకి విడిచి పెడుతోంది. ఇందుకు 11 మీటర్ల అడుగులో సముద్రంలో పైపులైన్‌ను 2.3 కిలో మీటర్ల మేర నిర్మించింది. అక్కడ ఈ వ్యర్థ జలాలను సముద్రంలో కలుపు తోంది. దివిస్ తొండంగిలో రూ.1,200 కోట్లతో ఫార్మా కంపెనీ నిర్మించింది. ఈ సంస్థ కూడా ఫార్మా ఉత్పత్తుల వ్యర్థ జలాలను 1.3 కిలోమీటర్ల మేర సముద్రంలో పైపులైన్ నిర్మించి వదులుతోంది.

నిర్ధారణ.. ఒక సవాల్..

సముద్రంలో ఫార్మా వ్యర్థ జలాల కాలుష్యం ఏ స్థాయిలో ఉందనేది నిర్ధారించడం కష్టంతో కూడుకున్న పని.ఫార్మా వ్యర్థ జలాల ప్రభావం సముద్రంలో ఎలా ఉందనేది తేల్చడానికి కంపెనీ సముద్రంలో నిర్మించిన పైపులైన్‌గుండా ప్రత్యేకమైన రంగుతో కూడిన రసాయనం విడు దల చేస్తుంది. పైపులైన్ ముగిసిన ప్రదేశంలో వ్యర్థజలాలు నీటిలో కలిసేచోట శాంపిళ్ల సేకరి స్తుంది.ఈ వ్యర్థ జలాలు విడుదలైన చోటు నుంచి 250 మీటర్ల వరకు శాంపిళ్లు తీసుకుం టుంది. ఈ విష జలాల వల్ల చనిపోతున్న మత్స్యసంపదకు సంబంధించి వాటి అవశేషా లను పరీక్షిస్తుంది. ఒకరకంగా చెప్పాలంటే సముద్రంలో ఫార్మా వ్యర్థజలాలు కలిసిపోయిన తర్వాత అవి విస్తరించి చాలా సూక్ష్మస్థాయిలో రసాయనాలు విడిపోతాయి. వీటిని సూక్ష్మ స్థాయిలో పరిశీలించాల్సి ఉంటుంది. అరబిందో, దివిస్ ఫార్మా కంపెనీలు విడుదల చేస్తున్న వ్యర్థ జలాలను కంపెనీల్లో తనిఖీలు నిర్వహించి పరి శీలిస్తారు. వీటికి సంబంధించి ప్రాథమిక నివేదిక తయారు చేసిన తర్వాత ఏయే రకాల రసాయనాలు సముద్రంలో కలుస్తున్నాయి? వాటి ప్రభావం చేపలవేటపై ఎలా ఉంటుంది? ఎంత మేర సముద్రజలాలపై విస్తరించి ప్రభావం చూపుతున్నాయి? వంటి కోణాల్లో విశ్లేషించనున్నారు. కాలుష్య ప్రభావం నిర్ధారించే బాధ్యతలను అప్పగించేందుకు ఆయా సంస్థల ను అధికారులు నేరుగా కలిసి వివరించేందుకు పీసీబీ అధికారులు సమాయత్తమవుతున్నారు. సముద్రంలో ఫార్మా వ్యర్థ జలాల కాలుష్యం నిజమేనని తేలితే నష్టపోతున్న మత్స్యకారులకు వేట పరిహారం ఇప్పించే అంశం.అటు కంపెనీల లోపాలను దిద్దుబాటు చేసే అంశంపై ఎలా వ్యవహరించాలనే దానిపై అధికారులు సమాలోచనలు చేస్తున్నారు.

రబీకి కార్యాచరణ ప్రణాళిక!

» లక్షా80వేల ఎకరాల్లో సాగుకు సన్నాహాలు
» వచ్చేనెల 15 నుంచి నారుమడులు
» పీఆర్ 126 రకానికి విదేశాల్లో మంచి డిమాండ్
» ప్రతిఏటా ఎంటీయూ 3626 రకం సాగు చేస్తున్న రైతులు

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీలో వరిసాగుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. లక్షా80వేల ఎకరాల్లో వరిసాగు చేయాలని ప్రణాళిక రూపకల్పన చేస్తున్నారు. వరిలో పీఆర్ 126 రకం విత్తనాలు నాటాలని జిల్లాలో రైస్‌మిల్లర్లు కోరుతున్నారు. ఈరకం ఉత్పత్తులకు విదేశాల్లో మంచి గిరాకీ ఉంది. సులభంగా ఎగుమతులకు ఆస్కారం ఉంది. ఈ నేపథ్యంలో పీఆర్ 126 రకం వరి విత్తనాలు నాటాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారు. రైతులు మాత్రం ప్రతిఏటా ఎంటీయూ 3626 రకం విత్తనాలు ఎక్కువగా రబీ సీజన్‌లో నాటుతున్నారు. దీనిద్వారా రబీ సీజన్‌లో అధిక దిగుబడులు సాధించవచ్చునని రైతులు అభిప్రాయపడుతున్నారు. పీఆర్ 126 రకం సాగుచేయడం వల్ల ఎగుమతులు బాగుంటాయని, రైతులకు అధిక ధరలు వస్తాయని మిల్లర్లు చెప్తున్నారు. పీఆర్ 126 వరిరకం విత్తనాలు పంజాబ్ రకం విత్తనాలు, ఈ నేపథ్యంలో వ్యసాయశాఖ అధికారుల సమక్షంలో వీరు సమాలోచనలు చేస్తున్నారు. గతేడాది రబీ సీజన్‌లో 1.65లక్షల ఎకరాల్లో జిల్లాలో వరిసాగు చేశారు. 5.25 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లభించింది. దీనిలో 1.60లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం సేకరించింది. మిగిలిన ధాన్యాన్ని రైతులు బహిరంగ మార్కెట్‌లో విక్రయించారు. ఈసారి మిల్లర్లే పీఆర్ 126 విత్తనాలు సాగు చేయాలని కోరడంతో దీనిపై రైతులు, అధికారులు ఆలోచనలో పడ్డారు.

రబీలో మెట్టలో అపరాల సాగు

సాగునీరు ఆశించినస్థాయిలో విడుదల చేయకపోతే మెట్టప్రాంతంలో రబీలో అపరాలు సాగు చేసేందుకు ప్రణాళిక రచిస్తున్నారు. ప్రధానంగా మెట్టపరిధిలోఉన్న ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం మండలాల్లో మినుము, పెసలు వంటి అపరాల సాగుకు సిద్ధంగా ఉన్నారు. జాతీయ ఆహార భద్రతా మిషన్‌లో భాగంగా అపరాలను సాగు చేయనున్నారు.

రబీ సీజన్‌కు విత్తనాలు సిద్ధం

-వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్

రబీ సీజన్‌కు కావాల్సిన విత్తనాలు సిద్ధం చేస్తాం. కొంతవరకు రైతుల వద్ద విత్తనాలు వినియోగిస్తారు. మిగిలినవి ప్రభుత్వం సరఫరా చేస్తుంది. దీనికోసం కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నాం. నవంబరు 15 నుంచి నారుమడులు సిద్ధం చేయనున్నారు. డిసెంబరు 15 నుంచి నాట్లు వేయడం, వచ్చే మార్చి మొదటివారం నుంచి పంట చేతికొచ్చే విధంగా ప్రణాళిక రూపకల్పన చేస్తున్నాం. సాగునీరు విడుదల ప్రకారం వరిసాగు జరుగుతుంది. దీనిపైన వ్యవసాయశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. రబీ సీజన్‌లో జిల్లాలో అధిక దిగుబడులే లక్ష్యంగా ప్రణాళిక రూపొందిస్తున్నాం.

వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సాంఘిక, గురుకుల, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమ వసతిగృహాలు, కేజీబీవీ వసతిగృహాల్లో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో సోమవారం ఆయన ట్రైనీ కలెక్టర్ మనీషాతో కలిసి సాంఘిక, గురుకుల, వెనుకబడిన తరగతులు, గిరిజన సంక్షేమ వసతిగృహాలు, రెవెన్యూ,హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ వసతిగృహాలు 88 ఉన్నాయన్నారు. ప్రతి వారం తమ పరిధిలో ఉన్న సంక్షేమ, వసతిగృహాల్లో అధికారులు భోజనం నాణ్యతను తనిఖీ చేయాలన్నారు. నియోజకవర్గ ప్రత్యేకాధికారి, వసతిగృహాల్లో తహసీల్దార్, ఎంపీడీవో, వైద్య ఆరోగ్యం, విద్యుత్‌శాఖల అధికారులు తమ శాఖ పరిధి కిందకి వచ్చే అంశాలను పరిశీలించి త్వరితగతిన నివేదిక సమర్పించాలన్నారు. పారిశుధ్యం, మరుగుదొడ్లు, తాగునీరు, అప్రోచ్‌రోడ్డు, కాంపౌండ్‌వాల్, విద్యుత్‌కనెక్షన్లు,ఆర్‌వో ప్లాంట్ల విషయాలను పరిశీలించాలన్నారు. వసతిగృహాలకు సంబంధించి ప్రతిపాదించిన పనులు వాటి పురోగతి కొత్తగా గుర్తించిన పనుల వివరాలను నివేదిక ఇవ్వాలన్నారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ జేడీ శోభారాణి, బీసీ సంక్షేమశాఖాధికారి లల్లి, అంబేడ్కర్ గురుకుల పాఠశాల సమన్వయకర్త కుమారి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ,ఆర్డీవో మల్లిబాబు, డీఈవో రమేష్, ఎస్ఎస్ఏ ఏపీవో వేణు గోపాల్‌రావు, ఏడీసీ సుధాకర్, ఈఈ వెంకట రాజులు పాల్గొన్నారు.

అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో అందిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్క రించాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తోందన్నారు. వివిధ అంశాలకు సంబంధించి 353మంది అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ మనీషా, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, సీపీవో త్రినాథ్, కాకినాడ జీజీహెచ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి శ్రీధర్, బీసీకార్పొరేషన్ ఈడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో..

కాకినాడక్రైం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులపట్ల పోలీస్ సిబ్బంది మర్యాదపూర్వకంగా మెలగాలని ఎస్పీ జి.బిందుమాధవ్ ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 65మంది అర్జీదారులు ఎస్పీ సోమవారం నిర్వహించిన పోలీస్‌గ్రీవెన్స్‌ను ఆశ్రయించారు. అర్జీదారుల సమక్షంలోనే సంబంధిత పోలీస్‌అధికారులతో ఎస్పీ మాట్లాడి ఫిర్యాదులు సమ్మతమైనవైతే ఎఫ్ఐఆర్ నమోదు చేసి వేగవంతంగా దర్యాప్తు చేయాలన్నారు.



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్

దీపావళి తర్వాతే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం: జేసీ

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ అయిన తర్వాతే జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని జేసీ రాహుల్‌మీనా అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం అధికారులు, రైస్‌మిల్లర్లతో ఆయన ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 269 రైతు సేవాకేంద్రాల్లో ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రక్రియ జరుగుతుందన్నారు. 3లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని సేకరించే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. జిల్లాలో రైతుసేవాకేంద్రాల్లో 800మంది సిబ్బంది విధులు నిర్వహించేలా ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చామన్నారు. పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ దేవులనాయక్, జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు, జిల్లా సహకారఅధికారి శ్రీనివాసురెడ్డి, వ్యవసాయ శాఖాధికారి పద్మజ, రైస్‌మిల్లర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.

నాలుగురోజుల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తి చేయాలి

» వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్

కలెక్టరేట్(కాకినాడ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ-క్రాప్ నమోదు మరో నాలుగురోజుల్లో పూర్తిచేయాలని వ్యవసాయశాఖ జేడీ విజయ్‌కుమార్ ఆదేశించారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయం నుంచి సోమవారం ఆయన ఏడీఏలు, ఏవోలు, రైతు సేవా కేంద్రాల్లో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 96శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశారన్నారు. మిగిలిన 4శాతాన్ని మరో నాలుగు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల వివరాలను ఈ-క్రాప్ యాప్‌లో సమగ్రంగా నమోదు చేయాలని ఆదేశించారు.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
అసెట్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం.26-15-150, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్, చెంగలరావుపేట, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్. ల్యాండ్ లైన్ ఫోన్ నెంబర్: 0891-2537792/2537782, మొబైల్ నెంబర్: 9324517291, ఇ-మెయిల్ ఐడి: ubin0817295@unionbankofindia.bank

APPENDIX-IV-A [See Proviso to Rule 8 (6)]

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లో రూలు 8 (6) ప్రొవిజన్‌తో చదివే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం స్థిరాస్తుల ఇ-వేలం అమ్మకం ప్రకటన.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు తనఖా పెట్టిన / ఛార్జ్ చేసిన, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకున్న దిగువ తెలిపిన స్థిరాస్తులు దిగువ వివరించిన ఋణగ్రహీత(లు)/ హామీదారు(లు) నుండి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రావల్సిన బకాయి దానిపై తదుపరి వడ్డీ మరియు ఛార్జీలు, వ్యయాలతో కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు "ఎక్కడ ఎలా ఉన్నదో అలాగే" "అక్కడ ఏమి ఉన్నదో అదే" మరియు "అక్కడ ఏది ఉన్నా" పద్ధతిలో తేది. 30-10-2025న విక్రయించబడుతుందని ముఖ్యంగా దిగువ వివరించిన ఋణగ్రహీత (లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా నోటీసు జారీచేస్తూ తెలియజేయడమైనది. సెక్యూర్డ్ ఆస్తుల రిజర్వు ధర మరియు జమచేయవలసిన ధరావత్తు దిగువ వివరించబడినవి.

ఇ-వేలం తేది & సమయం: 30-10-2025, మ॥ 12.00 గం.ల నుండి సా॥ 5.00 గం.ల వరకు
(అమ్మకం ముగిసేవరకు ప్రతి 10 నిమిషముల వ్యవధిలో అపరిమిత పొడిగింపుతో)

ఋణగ్రహీత : శ్రీ పీతల శుభకర్ బాబు, తండ్రి: పి రాజారావు, డి.నెం. 2-42, రామాలయం వీధి, గద్దనపల్లి, కిర్లంపూడి మండలం, కాకినాడ, కాకినాడ జిల్లా-533431. ఋణగ్రహీత ఆఫీస్ చిరునామా : సీనియర్ అసిస్టెంట్, ఎమ్.పి.పి., మారేడుమిల్లి, రంపచోడవరం, తూర్పుగోదావరి జిల్లా-533228. హామీదారు : శ్రీ పాలగడ్డ కృపా రత్నం, తండ్రి: పి భాస్కర రావు, సీతంశెట్టి నగర్, రంపచోడవరం మండలం, తూర్పుగోదావరి జిల్లా-533288.

బకాయి మొత్తం: తేది. 30.09.2025 నాటికి బకాయి రూ.28,63,286/- (అక్షరాల ఇరవై ఎనిమిది లక్షల అరవై మూడు వేల రెండు వందల ఎనభై ఆరు రూపాయలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.

అమ్మకానికి పెట్టిన సెక్యూర్డ్ స్థిరాస్తి వివరములు

శ్రీ పీతల శుభకర్ బాబు గారికి చెందిన ఆస్తి. ఐటమ్-1 : కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్, గంగనపల్లి గ్రామం, కొత్త ఆర్.ఎస్. నెం. 91/1 నందు మొత్తం 897 చ॥గ॥లోని అవిభాజ్యపు వాటా 85 చ॥గ॥లు. 897 చ॥గ॥లుకు హద్దులు: తూర్పు: 22 అ॥ వెడల్పు రోడ్డు, పడమర: ఎమ్. జార్జ్ రాజ రత్నం గారికి చెందిన ఆస్తి, ఉత్తరం: కె సొల్మాన్ రాజుకు చెందిన ఆస్తి, దక్షిణం: ఇతరులకు చెందిన ఆస్తి.

ఐటమ్-2 : కాకినాడ జిల్లా, కాకినాడ రూరల్, గంగనపల్లి గ్రామం, క్రొత్త ఆర్.ఎస్. నెం. 91/1, డి.నెం.3-83, శ్రీ వీరభద్ర నివాస్, గ్రౌండ్ ఫ్లోర్‌లోని 750 చ॥అ॥తో సెమీ ఫినిష్డ్ 2 BHK ఫ్లాట్ నెం. జి2. ఫ్లాట్ హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం. జి1, పడమర: ఇతరుల యొక్క స్థలం, ఉత్తరం: శూన్యాకాశం, దక్షిణం: శూన్యాకాశం. కో-ఆర్డినేట్స్: 16.971619 N, 82.206852E.

రిజర్వు ధర: రూ. 11,00,000/- ధరావత్తు సొమ్ము: రూ. 1,10,000/- బిడ్ పెంపుదల మొత్తం: రూ. 20,000/-

ఆస్తిపై బ్యాంకుకు తెలిసిన మేరకు ఎటువంటి ఎన్‌కంబ్రెన్సెస్ లేవు. (1) ఆన్‌లైన్ ఇ-వేలం వెబ్‌పోర్టల్ / వెబ్‌సైట్ https://baanknet.com ద్వారా నిర్వహించబడును. (2) రిజిస్ట్రేషన్ మరియు లాగిన్ మరియు బిడ్డింగ్ రూల్స్ కొరకు మరియు అమ్మకం నియమ నిబంధనల కొరకు https://baanknet.com దర్శించండి మరియు లాగిన్ & రిజిస్ట్రేషన్ కొరకు వెబ్‌సైట్ హోమ్‌పేజీలో "బయ్యర్ రిజిస్ట్రేషన్" లింకును దయచేసి క్లిక్ చేయండి. (3) ఇ-వేలం అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు బ్యాంకు వారి వెబ్‌సైట్: https://www.unionbankofindia.co.in/auction-property/view-auction-property.aspx మరియు www.unionbankofindia.co.in లో లభిస్తాయి.

తేది : 09-10-2025, స్థలం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ముందే ముగించారు!

» 15రోజుల గడువు వారానికే కుదింపు
» కాకినాడ కార్పొరేషన్‌లో నాలుగో తరగతి సిబ్బంది ఉద్యోగోన్నతుల్లో అధికారుల చేతివాటం!

కార్పొరేషన్(కాకినాడ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ నగరపాలకసంస్థలో అధికారుల చేతివాటం చర్చనీయాంశంగా మారింది. 15రోజుల గడువుతో పూర్తి చేయాల్సిన ఉద్యోగోన్నతి ప్రక్రియకు సంబంధించిన కామన్ సీనియారిటీ జాబితాను వారం రోజుల్లోనే పూర్తి చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కాకినాడ నగరపాలక సంస్థలో పనిచేస్తున్న పబ్లిక్‌హెల్త్, నాన్ పబ్లిక్‌హెల్త్, అటెండర్లు ఇలా 4వ తరగతి సిబ్బంది ఉద్యోగోన్నతి కోసం కామన్ సీనియారిటీ లిస్టు కోసం కనీసం 15 రోజులు గడువు ఇచ్చి అభ్యంతరాలు స్వీకరించాలి. అధికారులు అందుకు విరుద్ధంగా కేవలం ఏడు రోజులు మాత్రమే గడువు ఇచ్చి ఆగమేఘాల మీద సిబ్బందికి ఉద్యోగోన్నతి కల్పించారని సమాచారం. దీనివెనుక ఇంజనీరింగ్ విభాగంలో ఉన్నతస్థాయి అధికారులు సిబ్బందివద్ద చేతివాటం ప్రదర్శించినట్టు విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకే 15 రోజులు గడువుని, వారంరోజులకే కుదించారని తెలుస్తోంది. సిబ్బంది పదోన్నతుల ఫైల్స్ ప్రక్రియల్లో ప్రాధాన్యం ఎవరికి? ఎందుకు? అనే ప్రశ్నలు వస్తున్నాయి. దీనిపై కొందరు సిబ్బంది అంతర్గత వర్గాల్లో అసంతృప్తి రేపుతోంది. నియమ నిబంధనలు పాటించకుండానే కొంతమందికి ప్రత్యేక ప్రాధాన్యమిచ్చారని,ఫైల్స్ కదిలిన వేగంచూస్తే అనుమానం రాక మానదని సిబ్బందిలో ఒక వర్గం ఆరోపిస్తోంది.

ఆదర్శమూర్తికి అశ్రునివాళి



జననం: 20-12-1951
మరణం: 04-10-2025

కీ॥శే॥ అడపా అప్పారావు గారు
సీనియర్ జర్నలిస్ట్
రోళ్ళపాలెం, అమలాపురం మండలం

ప్రేమ అప్యాయతలు మాకు పంచియిచ్చి, మా ఉన్నతికి అహర్నిశలు కృషిచేసి, మీరు ఎంచుకున్న వృత్తిలో ఐదు దశాబ్దాలుగా వుంటూ... విలువలతో కూడిన జర్నలిజంలో ప్రజల సమస్యలపై భాగస్వామిగా నిలిచి... వాటి పరిష్కారానికి నడుంబిగించి అందరి హృదయాలలో చెరగని ముద్రవేసుకొన్న, ఆదర్శమూర్తి సీనియర్ జర్నలిస్ట్ శ్రీ అడపా అప్పారావు గారి ఆకస్మిక మృతికిచింతిస్తూ.. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

భార్య: సరస్వతి
కుమార్తె: రేకపల్లి తేజస్విని అల్లుడు: చెన్నకేశవ జగదీశ్వర్
మనుమరాలు: చిన్నయి శ్రీసూర్యఅపర్ణ
వియ్యంకుడు: రేకపల్లి రాంబాబు వియ్యపురాలు: రత్నకుమారి
అడపా వీరస్వామి - సత్తెమ్మ, రేకపల్లి నాగభూషణం - సూర్యకాంతం, కుటుంబ సభ్యులు

పెద్దకార్యం:
ది.15-10-2025 బుధవారం రోళ్ళపాలెం భట్నవిల్లి-పేరూరు వై జంక్షన్ NH-216 జాతీయ రహదారి ప్రక్కన మా స్వగృహమునందు జరుగును.




స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు మహా స్నపనం నిర్వహిస్తున్న అర్చకులు, కల్యాణోత్సవంలో భాగంగా తలంబ్రాలు పోస్తున్న దృశ్యం

యోగ నారసింహుడై... సింహవాహనారూఢుడై



- వాడపల్లిలో శాస్త్రోక్తంగా మహా స్నపనం
- శ్రీభూ సమేత శ్రీవేంకటేశ్వరస్వామికి జగత్ కల్యాణం
- నాలుగో రోజుకు శ్రీవారి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు
- గోవిందనామస్మరణతో మార్మోగిన కోనసీమ తిరుమల



ఆత్రేయపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు నాల్గవ రోజుకు చేరుకున్నాయి. సోమవారం ఉదయం స్వామివారి ఉత్సవ మూర్తులను వసంత మండపంలో కొలువుదీర్చారు. వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ఖండవల్లి రాజేశ్వరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేద పండితులు, అర్చకులు విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అష్టకలశారాధన, మహా స్నపనం, ప్రధాన హోమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. లోక కల్యాణార్థం శ్రీనివాసుని కల్యాణం రమణీయంగా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామివారికి పట్టు వస్త్రాలను చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉప కమిషనరు నల్లం సూర్యచక్రధరరావు సమర్పించారు.

సాయంత్రం స్వస్తి వాచనం, ప్రధాన హోమాలు, విశేష అర్చన, చతుర్వేద స్వస్తి జరిపారు. మహారాష్ట్ర కళాకారుల వాయిద్యాలు, మహిళల కోలాటం, కర్రసాము ప్రదర్శనలు భక్తులను ఊర్రుతలూగించాయి. రాత్రి యోగనారసింహ అలంకరణలో శ్రీవారు ముస్తాబై సింహ వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో విహరించారు. వాహన సేవలో పాల్గొన్న భక్తులు స్వామివారి అనుగ్రహం పొందారు.




స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న చైర్మన్, ఉప కమిషనరు దంపతులు... వేంకటేశ్వరస్వామి, దేవేరుల అలంకరణల్లో కళాకారులు




ఆకట్టుకున్న మహారాష్ట్ర కళాకారుల వాయిద్యాలు, మహిళల కోలాట ప్రదర్శన



అందాల కొండ... మేఘాలు నిండా...

ఉదయం, సాయంత్రం వేళల్లో పొగ మంచు... అప్పుడప్పుడు చిరుజల్లులు... మన్యంలో ఇలా భిన్నమైన వాతావరణం మనసుకు హాయి గొలుపుతుంది. పచ్చని పొలాలు ఒకవైపు... కొండలపై నుంచి మేఘాలు తేలియాడుతున్నట్టు మరోవైపు... ఇలా మంచు సోయగాలు పర్యాటకులను అబ్బురపరుస్తున్నాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెం-డొంకరాయి మార్గమధ్యంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి చిక్కిన మంచు మనోహర దృశ్యమిది.

- మోతుగూడెం (ఆంధ్రజ్యోతి)



ప్రతిభాన్వేషణ

కౌశల్ రాష్ట్ర స్థాయి సైన్స్ క్విజ్ పోటీలు-2025 షెడ్యూల్ విడుదల



అమలాపురం రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రతిభా పాటవాలు, సైన్స్ పరిజ్ఞానాన్ని వెలికితీసేందుకు కౌశల్ క్విజ్ పోటీలు దోహదపడతాయి. భారతీయ విజ్ఞాన మండలి, అప్‌కాస్ట్ సైన్స్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. కౌశల్ రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రతిభాన్వేషణ పోటీలు-2025 షెడ్యూల్‌ను విడుదల చేశారు. నవంబరు 1 నుంచి పాఠశాల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాలుగు విభాగాలుగా జరిగే పోటీల్లో అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు విజేతలకు నగదు బహుమతులు అందజేస్తారు.

పాఠశాల స్థాయి పరీక్షలు ఇలా...

పాఠశాల స్థాయిలో క్విజ్ పోటీలను 8, 9, 10 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తారు. వారిలో ఒక్కో తరగతికి ముగ్గురు విద్యార్థులను మాత్రమే ఎంపిక చేయాలి. రీల్ పోటీలకు పదో తరగతి విద్యార్థులు మాత్రమే అర్హులు. పోస్టర్ కాంపిటీషన్-1 పోటీలను 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించి ఇద్దరిని మాత్రమే ఎంపిక చేయాలి. పోస్టర్ కాంపిటీషన్-2 పోటీలను 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించి ఇద్దరిని ఎంపిక చేయాలి. క్విజ్, రీల్ కాంపిటీషన్, పోస్టర్ కాంపిటీషన్‌లో పాల్గొనే విద్యార్థులకు స్కూల్ లెవెల్‌లోనే ఆన్‌లైన్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. క్విజ్ పోటీలకు ఎస్‌సీఈఆర్టీ సిలబస్ అక్టోబరు వరకు ఉంటుంది. రీల్ పోటీలకు ఇండియన్ కాంట్రిబ్యూషన్ టు సైన్స్ వెబ్‌సైట్, పోస్టర్ కాంపిటీషన్ పోటీలకు భారత దర్శన్ మెటీరియల్ వినియోగించుకోవాలి. పాఠశాల స్థాయిలో నిర్వహించే పరీక్షల్లో ప్రతి తరగతి నుంచి క్విజ్‌కు 20 మంది, రీల్‌కు 20 మంది, పోస్టర్-1కు 20 మంది, పోస్టర్-2కు 20 మంది చొప్పున జిల్లా స్థాయి పోటీలకు ఫైనల్‌గా ఎంపిక చేస్తారు. నవంబరు 1, 3, 4 తేదీల్లో స్కూల్ లెవెల్ పరీక్షలు నిర్వహిస్తారు.

జిల్లా స్థాయిలోను ఆన్‌లైన్ పరీక్ష...

జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులకు ఆన్‌లైన్‌లో పరీక్షనిర్వహిస్తారు. వారిలో రాష్ట్ర స్థాయికి ప్రతి జిల్లా నుంచి క్విజ్ పోటీలకు 8, 9, 10 తరగతుల నుంచి ఇద్దరేసి విద్యార్థులు పాల్గొంటారు. రీల్ కాంపిటీషన్‌కు పదో తరగతి విద్యార్థులు ఇద్దరు, పోస్టర్ కాంపిటీషన్-1కు 9వ తరగతి విద్యార్థులు ఇద్దరు, పోస్టర్ కాంపిటీషన్-2కు 8వ తరగతి విద్యార్థులు ఇద్దరు ఎంపికవుతారు. ఇలా ప్రతి జిల్లా నుంచి విద్యార్థులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. 8, 9 తరగతుల విద్యార్థులకు నవంబరు 27న, పదో తరగతి విద్యార్థులకు నవంబరు 28న పరీక్షలు జరుగుతాయి.

రాష్ట్ర స్థాయిలో ముఖాముఖి పోటీలు

ఎం.సూర్యనారాయణ, జిల్లా స్థాయి పరీక్షల నిర్వహణాధికారి



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ఆయా విభాగాల్లో ముఖాముఖి పోటీలు నిర్వహిస్తారు. డిసెంబరు 27న తిరుపతిలో జరిగే భారతీయ విజ్ఞాన జాతీయ సమ్మేళనంలో ఈ పోటీలు నిర్వహిస్తారు. జిల్లా స్థాయి విజేతలకు ప్రథమ బహుమతి రూ.4,500, ద్వితీయ బహుమతిగా రూ.3వేలు, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రథమ బహుమతి రూ.15వేలు, ద్వితీయ బహుమతి రూ.12వేలు, తృతీయ బహుమతి రూ.9వేలతో పాటు రూ.6వేలు చొప్పున కన్సొలేషన్ బహుమతులను ఆయా విభాగాల్లో అందజేస్తారు. అర్హులైన విద్యార్థులంతా కౌశల్ పోటీల్లో పాల్గొనాలి.

జాతీయ క్రీడా పోటీలకు అంబాజీపేట విద్యార్థులు



జాతీయ పోటీలకు ఎంపికైన అంబాజీపేట విద్యార్థులు

అంబాజీపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో అంబాజీపేటకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు తైక్వాండో సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. ఈ నెల10 నుంచి 12వరకు బాపట్ల జిల్లా పేటేరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి తైక్వాండో స్కూల్ గేమ్స్‌లో 20కిలోల విభాగంలో కుడుపూడి కావ్య సుందరి హరిప్రియ ప్రథమ, 24 కిలోల విభాగంలో యెరుబండి ఇషానాగశ్రీనిజ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కనబరిచిన విద్యార్థులు పంజాబ్‌లో జరిగే జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొంటారని కోచ్ త్రిమూర్తులు తెలిపారు.

జాతీయ షూటింగ్‌బాల్ పోటీలకు నీలిమ

ముమ్మిడివరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కర్నూలులో ఇటీవల నిర్వహించిన ఏపీ ఇంటర్ డిస్ట్రిక్ట్ షూటింగ్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ముమ్మిడివరం శ్రీబాలాజీ కాన్వెంట్‌లో పదో తరగతి చదువుతున్న యనమదల నీలిమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. నవంబరు 7,9తేదీల్లో జరిగే జాతీయ పోటీల్లో ఆమె పాల్గొనున్నట్టు హెచ్ఎం పీవీ రామరాజు తెలిపారు. నీలిమను కాన్వెంట్ కరస్పాండెంట్ పి.సుజాత, వ్యవస్థాపక అధ్యక్షుడు వీవీఎస్ శాస్త్రి, ఉపాధ్యాయులు అభినందించారు.



నీలిమను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు తేజశ్రీ ఎంపిక



బిక్కవోలు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పందలపాక ఉన్నత పాఠశాలకు చెందిన పి.తేజశ్రీ అండర్-19 రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్‌కు ఎంపికయ్యిందని హెచ్ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం పెదపూడి మండలం గొల్లల మామిడాడలోని ఫ్యామిలీ హెల్త్‌క్లబ్‌లో జరిగిన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అండర్-19 బాలికల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్ఎం చెప్పారు. ఈ సందర్భంగా తేజశ్రీని, తర్ఫీదు నిచ్చిన పీడీ యువరాజారెడ్డిని హెచ్ఎంతో పాటు పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ కోనాల సత్తిరాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

తైక్వాండోలో రాష్ట్రస్థాయికి శశిరేఖ

రాజోలు, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): తాటిపాక వేద జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోన్న యెరుబండి లక్ష్మీశశిరేఖ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించిందని వేద విద్యా సంస్థల సెక్రటరీ ఏవీఎస్ఎస్ రవికుమార్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాపన్న లక్ష్మీశశిరేఖకు శాలువా కప్పి సన్మానించారు. లక్ష్మీశశిరేఖను సెక్రటరీ రవికుమార్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జి.సోమేశ్వరరావు, ఏవో రామరాజు, నాన్ అడకమిక్ డైరెక్టర్ కంచి సూర్యనారాయణ అభినందించారు.



శశిరేఖను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

రేపటి నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు

కాకినాడ సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వాకలపూడిలోని డీడీయూజీకేవై సెంటర్‌లో బుధవారం నుంచి నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని వికాస పీడీ కె.లచ్చారావు వెల్లడించారు. ఈ శిక్షణకు టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లమో ఉత్తీర్ణులైన 18 నుంచి 30 ఏళ్లలోపు పురుష అభ్యర్థులు అర్హులన్నారు. వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ కోర్సుకు 3 నెలల శిక్షణ ఇచ్చి ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగం కల్పిస్తారన్నారు.శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వ ద్వారా సర్టిఫికెట్ ఇవ్వనున్నట్టు చెప్పారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, వసతి, యూనిఫారమ్, స్టడీ మెటీరియల్ అందిస్తారన్నారు. ఈ కోర్సుతో పాటు బేసిక్ కంప్యూటర్ కోర్సు, కమ్యూనికేషన్,ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు సెల్ నెంబర్లు 83284 83297, 89784 75164లో సంప్రదించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

సామర్లకోట భీమేశ్వర ఆలయంలో సుప్రీంకోర్టు మాజీ చీఫ్ జస్టిస్ పూజలు



భీమేశ్వరాలయంలో పూజలు నిర్వహిస్తున్న జస్టిస్ రమణ దంపతులు

సామర్లకోట/పిఠాపురం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి ఎన్వీ రమణ సతీసమేతంగా సోమవారం రాత్రి సామర్లకోట కుమారరామ భీమే శ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించా రు. ఆలయానికి చేరుకున్న ఎన్వీ రమణ దంప తులకు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) ఆధ్వర్యంలో అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలోని అన్ని ఉపాలయాల దేవతామూర్తులను దర్శించిన రమణ దంపతులు ముందుగా భీమేశ్వరునికి, బాలాత్రిపుర సుందరిదేవికి విశేష పూజలు నిర్వహించారు. పండితులు వేదాశీర్వాదంతో ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు. ఈ సందర్భంగా వారి వెంట జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి సునీత గంధం, కాకినాడ జిల్లా నాలుగో జూనియర్ జడ్జి నిరుపభాంజ్, డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాసు, సీఐ కృష్ణభగవాన్ తదితర ఆలయాధికారులు పాల్గొన్నారు. అలాగే జస్టిస్ ఎన్వీ రమణ దంపతులు పిఠాపురంలోని పాదగయ క్షేత్రాన్ని సందర్శించారు. కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయ స్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. వేదపండితులు క్షేత్రప్రాశస్త్యాన్ని వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఈవో కాట్నం జగన్మోహన శ్రీని వాస్ శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు, స్వామి, అమ్మవార్ల చిత్రపటాలను అందజేశారు.

18 మంది యాచకులకు నేర చరిత్ర: ఎస్పీ



యాచకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 18 మంది యాచకులకు నేర చరిత్ర ఉన్నట్టు గుర్తించామని.. తగు దర్యాప్తు అనంతరం చర్యలు తీసుకుంటామని ఎస్పీ నర సింహ కిషోర్ పేర్కొన్నారు. కొంతమంది యాచకులు ఎక్కడ పడితే అక్కడ మద్యం తాగడంతోపాటు నేరాలకు పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీంతో రానున్న పుష్కరాల దృష్ట్యా ఆదివారం రాత్రి ప్రత్యేక సోదాలు చేశామన్నారు. దీంట్లో 193 మందిని గుర్తించామని, వారిలో 18 మందికి నేర చరిత్ర ఉందన్నారు. మిగతా వాళ్లను కౌన్సెలింగ్ చేసి స్వగ్రామాలను పంపించామని చెప్పారు. ఈ డ్రైవ్‌ని కొనసాగిస్తామని ఎస్పీ పేర్కొన్నారు.

కె రాంప్.. వినోదాత్మక చిత్రం హీరో కిరణ్ అబ్బవరం



సమావేశంలో మాట్లాడుతున్న హీరో కిరణ్

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అన్ని హంగులున్న వినోదాత్మక చిత్రం కె రాంప్ అని ఆ సినిమా హీరో కిరణ్ అబ్బవరం అన్నారు. సినిమా ప్రమోషన్‌లో భాగంగా సోమవారం రాజమహేంద్రవరం వచ్చిన ఆయన స్థానిక హోటల్ షెల్టాన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ ఈ నెల 18న దీపావళి కానుకగా ప్రపంచ వ్యాప్తంగా కె రాంప్ సినిమా విడుదలఅవుతుందన్నారు. హాస్య మూవీస్ పతాకంపై జైన్స్ నాని దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన కె రాంప్ సినిమా ఆద్యంతం స్పీడుగా నడుస్తుందన్నారు.ఈ సిని మా టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. ఈ సినిమాలో యుక్తి తరేజా, నరేష్, సాయికుమార్, ఆలీ, వెన్నెల కిషోర్, అజయ్ అన్నతదితరులు నటించిన కె రాంప్ సినిమా మాస్ కామెడీ ఎంటర్ టైనర్‌గా అన్ని వర్గాలను ఆకట్టుకుటుందని కిరణ్ అన్నారు. బాలయ్య సాంగ్‌తో ఎంట్రీ ఉంటుందన్నారు. పండగ సీజన్ కావడంతో కుటుంబ సమేతంగా వీక్షించాలనుకునే వాళ్లు కచ్చితంగా ఈ సినిమాకు వస్తారనే నమ్మకం ఉందన్నారు. సినిమాటో గ్రఫీ సతీష్ రెడ్డి, ఎడిటర్ చోటా కె.ప్రసాద్, సంగీతం చైతన్ భరద్వాజ్‌లు సినిమాకి మంచి రెస్పాన్స్ తెచ్చారని చెప్పారు. భవిష్యత్తులో తనకు ఘటోత్కచుడు వంటి పాత్రలతో సినిమాలు చేయాలని ఉందని కిరణ్ అన్నారు.

జయలక్ష్మి బ్యాంకు బాధితులను ఆదుకోవాలి

కలెక్టరేట్‌లో నిరసన.. సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కలెక్టర్



కలెక్టరేట్‌లో నిరసన చేపట్టిన బ్యాంకు బాధితులు

కలెక్టరేట్ (కాకినాడ), అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జయలక్ష్మి కో-ఆపరేటివ్ బ్యాంకు బాధితులను ఆదుకోవాలని కాకినాడ కలెక్టరేట్‌లో బాధితులు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితుడు ఈరంకి రఘుభూషణ్ మాట్లాడుతూ జయలక్ష్మి బ్యాంకు కుంభకోణంలో రూ.600 కోట్లు మాయం చేశారన్నారు. దీని వల్ల 19 వేల మంది బాధితులు రోడ్డున పడ్డారన్నారు.ఇప్పటి వరకు 90మంది బాధితులు వివిధ ఆరోగ్య సమస్యలతో మృతిచెందారని ఆవేదన వ్యక్తంచేశారు. పైగా ఇప్పుడు జయలక్ష్మి ప్రస్తుత బోర్డు త్రినాథ్‌రావు ఆధ్వర్యంలో కూడా రూ.3.77 కోట్లు బాధితుల సొమ్ము దుర్వినియోగమైందని ఆరోపించారు. బాధితుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ బోర్డును రద్దు చేసి కొత్తబోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈనేపథ్యంలో సెక్షన్ 29 ప్రకారం బోర్డు డైరెక్టర్లపై విచారణకు ఆదేశించామని కలెక్టర్ పేర్కొన్నారన్నారు.అలాగే రాజమహేంద్రవరం నుంచి 50 సంతకాలతో ఇచ్చిన అవిశ్వాస తీర్మానం అందిన మరో 25 రోజుల్లో ప్రత్యేక సర్వజన మహాసభ పెడతామని కలెక్టర్ హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో బాధితులు బదరి నారాయణ, కస్తూరి రవికుమార్, వీఎస్‌వీ సుబ్బారావు, ప్రభాకర్‌రావు, బేగం, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇన్ఫినిటమ్ కాంపిటీషన్‌లో 'ఆదిత్య' విద్యార్థుల ప్రతిభ



సంస్థ ప్రతినిధుల నుంచి బహుమతి అందుకుంటున్న విద్యార్థులు

కాకినాడ రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): కాలికట్‌లోని నిట్ సంస్థ ఈ ఏడాది నిర్వహించిన ఇన్ఫినిటమ్ కాంపిటీషన్‌లో కాకినాడ జిల్లా కాకినాడ రూరల్‌లోని గంగరాజునగర్ ఆదిత్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానంలో నిలిచారని ప్రిన్సిపాల్ జె.మొయినా తెలిపారు.పదో తరగతి విద్యార్థులు ఎంజే సమర్థ,ఎం.సాయి అభినవ్ రూ.25వేల నగదు బహుమతిని చెక్కు రూపంలో నిట్ ప్రతినిధుల నుంచి అందుకున్నారు. వారిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్.శేషారెడ్డి, డైరెక్టర్ ఎన్.దీపక్‌రెడ్డి అభినందించారు.

ఏజెన్సీలో భారీ వర్షం

నీట మునిగిన పత్తి పంట
రంగు మారుతుందని రైతుల్లో ఆందోళన



రాయనపేటలో పత్తితోటలో నిలిచిన వరదనీరు

ఎటపాక, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం ఎటపాక ఏజెన్సీలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఈ వర్షం ప్రస్తుత పంటలకు కొంత ఖేదం... కొంత మోదంగా మారిందని రైతులు పేర్కొంటున్నారు. అయితే ఇప్పటికే సాగైన వరి, మిర్చి పంటలకు వర్షం మేలు చేసినప్పటికీ, మరోవైపు చేతికొచ్చిన పత్తిపంట కొంత మేర దెబ్బతిన నుంది. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఎటపాక మండలంలో 5,324 ఎకరాల్లో పత్తి పంట, 3,124 ఎకరాల్లో వరిపంట సాగు చేశారు. మొన్నటి వరకు పలు పర్యాయాలు వచ్చిన గోదావరి వరదల ధాటికి మిర్చి, వరి పంటలు దెబ్బతిన్నాయి.కాస్త పత్తి పంట బాగుందని భావించారు. ఇప్పటికే కాయ పగిలి పత్తిపంట చేతికొచ్చే దశలో ఉంది. వర్షం వల్ల కాయరంగు మారి, పంటమీద ఉన్న పత్తి రంగు మారిపోతుందని ఆందోళన చెందుతున్నారు. కాగా వర్షం ధాటికి పత్తి తోటల్లో వరదనీరు నిలిచింది.దీంతో కొందరు రైతులు నీటిని బయటకు మళ్లించారు.

ముంచిన వాన

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలుచోట్ల సోమవారం భారీ వర్షం కురిసింది. దీంతో రహదారులు జలమయమై చిన్నపాటి చెరువులను తలపించాయి. ఆ దృశ్యాలే ఇవి


పిఠాపురంలో జలాశయాన్ని తలపిస్తున్న మార్గాలు


కాకినాడ ప్రధాన రహదారిపై వర్షం నీరు




రాజమహేంద్రవరంలో మునిగిన రోడ్లపై వాహనదారుల పాట్లు



పిఠాపురం మండలం విరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద నిలిచిపోయిన నీరు



నిలిచిన పాపికొండల పర్యాటకం

వర్షాల కారణంగా రాని పర్యాటకులు


పోశమ్మగండి బోటు పాయింట్ వద్ద నిలిచి ఉన్న బోట్లు

దేవీపట్నం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు పర్యాటకానికి టిక్కెట్ల కొనుగోలు లేకపోవడంతో నిలిచింది. గోదావరి వరదల కారణంగా గత 3నెలల నుంచి పాపికొండలు విహారయాత్రకు బ్రేక్ పడింది. అయితే ఇటీవల గోదావరి తగ్గుముఖం పట్టడంతో 2 రోజుల క్రితం పాపికొండలు పర్యాటకానికి అధికారులు పచ్చజెండా ఊపారు. ప్రస్తుతం వర్షాల కారణంగా పర్యాటకులు పాపికొండలు పర్యాటకానికి ముందుకురాకపోవడంతో బోట్లన్నీ బోటు పాయింట్ వద్దే నిలిచిపోయాయి.

బాణసంచా సామగ్రి నిల్వల స్వాధీనం

తయారీదారుడి అరెస్ట్

తాళ్లరేవు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం సుంకరపాలెంలో బాణసంచా తయారీ కేంద్రాలపై కోరింగ ఎస్ఐ పి.సత్యనారాయణ సోమవారం తమ బృందంతో దాడులు నిర్వహించారు. సుంకరపాలెం తోటవారివీధికి చెందిన ఏడిద వీరవెంకట సత్యనారాయణను అక్రమంగా బాణసంచా సామగ్రి నిల్వలను ఉంచినట్టు గుర్తించి స్వాధీనం చేసుకుని అతడిని అరెస్ట్ చేశారు. అనుమతులు లేకుండా నిర్వహించే బాణసంచా తయారీ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ సత్యనారాయణ హెచ్చరించారు.

నూరుశాతం ఉద్యోగాలు ఆదివాసీలకే ఇవ్వాలి

చింతూరులో ఆదివాసీ నిరుద్యోగుల భారీ ర్యాలీ... జోరు వర్షంలోను ఐటీడీఏ ముట్టడి




చింతూరులో వర్షంలోను ర్యాలీగా వెళ్లి ఐటీడీఏను ముట్టడించిన ఆదివాసీలు

చింతూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మన్యంలో నూటికి నూరుశాతం ఉద్యోగ అవకాశాలు స్థానిక ఆదివాసీలకే కేటాయించాలని ఆదివాసీలు డిమాండ్ చేశారు. సోమవారం చింతూరులో భారీ వర్షంలోను ర్యాలీగా ఐటీడీఏ వద్దకు చేరుకుని ముట్టడించారు. కొద్దిరోజులుగా ఆదివాసీ నిరుద్యోగులు మండలంలోని ఆదివాసీ గ్రామాలు పర్యటించి జీవో నెం.3 తొలగింపుతో ఆదివాసీ నిరుద్యోగులకు జరిగిన నష్టంపై వివరించారు. అదేదశలో తమ డిమాండ్లు సాధించుకోవడానికి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉందని నిరుద్యోగులు ఊరూరా పర్యటించి సమావేశాలు, సభలు నిర్వహించి ఆదివాసీలకు అవగాహన కల్పించారు. ఈ మేరకు సోమవారం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమానికి ప్రతి ఆదివాసీ స్వచ్ఛందంగా తరలిరావాలని కోరగా పలు ఆదివాసీ సంఘాలు మద్దతునిచ్చాయి. జోరున వర్షం కురుస్తున్నా వెనకడుగు వేయకుండా ర్యాలీ, ముట్టడి కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆదివాసీ నాయకులు మన్యంలో నూటికి నూరు శాతం ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఆదివాసీ యువతకే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రత్యేక డీఎస్సీ నిర్వహించి మన్యంలో స్థానిక ఆదివాసీలకే అవకాశం కల్పించాలని, మన్యంలో గిరిజనేతరుల అక్రమ కట్టడాలను కూల్చివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ నాయకులు మడివి నెహ్రూ, అప్పల నర్స్, సీసం సురేష్, జల్లి నరేష్, కుంజా శ్రీను, ఉయిక రాంప్రసాద్, కారం సాయిబాబు, పొడియం రామకృష్ణ, మడివిరాజు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి కళాశాల రికార్డు అసిస్టెంట్ మృతి


శ్రీనివాస్ (ఫైల్)

అనపర్తి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా అనపర్తి మండలం కొప్పవరంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాయవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వేమగిరి గ్రామానికి చెందిన మట్టపర్తి శ్రీనివాస్(52) మృతి చెందాడు. వేమగిరికి చెందిన శ్రీనివాస్ రాయవరంలోని జూనియర్ కళాశాలలో రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. రోజు వేమగిరి నుంచి మోటార్ సైకిల్‌పై రాయవరం వచ్చి విధులు నిర్వహించుకుని వేమగిరికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరిన శ్రీనివాస్ కొప్పవరం వచ్చేసరికి బైక్ అదుపుతప్పి పడిపోయాడు. దీంతో తీవ్రగాయాల పాలైన శ్రీనివాస్‌ను గమనించిన స్థానికులు అతడి ఫోన్ ద్వారా స్నేహితులకు సమాచారం అందించి చికిత్స కోసం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శ్రీనివాస్ కొద్దిసేపటికే మృతిచెందాడు. ఈ ప్రమాదంపై శ్రీనివాస్ భార్య పద్మావతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్టు ట్రైనీ ఎస్ఐ సుజాత పేర్కొన్నారు.

గిరిజనులకు సత్యదీక్షా వస్త్రాల అందజేత


గిరిజనులకు దీక్షా వస్త్రాలను ఉచితంగా అందజేస్తున్న ఈవో

అన్నవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో హిందూధర్మప్రచారంలో భాగంగా ఈనెల 17నుంచి సత్యదీక్షలు ప్రారంభంకానున్న నేపథ్యంలో గిరిజన ప్రాంతాల్లో ఆసక్తి ఉన్న భక్తులతో సత్యదీక్షలు వేయించాలని నిర్ణయించారు. దీనిలో భాగంగా సోమవారం అడ్డతీగల మండలంలో పవనగిరి స్వామీజీ ఆధ్వర్యంలో సుమారు 600మందికి ఉచితంగా సత్యదీక్ష వస్త్రాలు, దీక్షామాలలను ఈవో సుబ్బారావు దేవస్థానం తరుపున అందజేశారు. 11 గిరిజన మండలాల్లో వీటిని అందజేయగా మిగిలినవారికి అవసరమైతే అందజేస్తామని ఈవో పేర్కొన్నారు.

అన్నవరం దేవస్థానంలో సంప్రోక్షణ ప్రారంభం

● వరుస వివాదాల నేపథ్యంలో నిర్వహణ ● మూడురోజుల పాటు కార్యక్రమాలు


సంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి వివిధ అంశాలపై ఇటీవల వరుస వివాదాలతో సతమతమవుతున్న నేపథ్యంలో నివారణా చర్యల్లో భాగంగా లోక కల్యాణార్థం దేవస్థానం వైదికకమిటీ సూచనల మేరకు సంప్రోక్షణ కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయంచడంతో సోమవారం ఉదయం నుంచి దర్బారు మండపంలో ప్రారంభమయ్యాయి. ఉదయం 8.56 నిమిషాలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, రుత్విక్‌వరుణలు, మంటపారాధనలు నిర్వహించారు. కల్యాణబ్రహ్మ చామర్తి వెంకటిరెడ్డి, ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పాలంకి చినపట్టాభి, విజెడి శర్మ నిర్వహించారు. ఈ నెల 15న ఉదయం 11గంటలకు పూర్ణాహుతితో ముగుస్తాయి. శ్రీమత్రిపాద్వి భూతి మహావైకుంఠ నారాయణోపనిషత్ పారాయణలు, హోమాది వైదిక కార్యక్రమాలు నిర్వహిస్తామని దేవస్థానం పండితులు పేర్కొన్నారు. ప్రధానాలయాల్లో ఏటా ఏదొక యజ్ఞయాగాధులు జరుగుతుంటుండగా అన్నవరం దేవస్థానంలో సైతం నిర్వహించేవారు. అయితే గత రెండేళ్లుగా ఏ యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించలేకపోయారు. తిరుమలలో సైతం ఏటా పవిత్రోత్సవాలు నిర్వహిస్తుంటారు. వరుస వివాదాల నేపథ్యంలో పండితుల సూచనల మేరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సులువుగా డబ్బు సంపాదించాలనుకుని నిలువునా మోసపోయి...

స్టాక్ మార్కెట్ వ్యాపారం మోజులో పడి

రూ.74 లక్షల సమర్పణ

రాజానగరం పోలీసులకు

ఫిర్యాదు చేసిన బాధితుడు

రాజానగరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ మాయాజాలం వలలో చిక్కుకుని అనేక మంది ఆర్థికంగా నష్టపోతున్నారు. సులువుగా డబ్బులు సంపాదించాలని ఓ వ్యక్తి స్టాక్ మార్కెట్ వ్యాపారం పేరుతో నిలువునా మోసపోయి ఏకంగా రూ.74 లక్షలు పోగొట్టుకున్నాడు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలోని కొంతమూరు గ్రామానికి చెందిన కాదా ఉమాకాంత్ ఆటోమోటివ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో అకౌంటెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో స్టాక్ మార్కెట్‌లో వ్యాపారం చేయాలనే ఉద్దేశంతో ఆగస్టు 17న ట్రేడింగ్ కోసం ఫేస్‌బుక్‌లో వెతికాడు. సావర్ట్ ట్రేడింగ్ యాప్ అనే పేరుతో లింక్ రాగా దానిని ఓపెన్ చేశాడు. మరుక్షణమే సావర్ట్ ట్రేడింగ్ పేరుతో వాట్సాప్ యాప్ ఓపెన్ అవ్వగా గ్రూప్‌లో యాడ్ అయినట్టు, స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెట్టాలంటే డీమేట్ అకౌంట్ ఓపెన్ చేయాలని మెసేజ్ వచ్చింది. దానిలో వివరాలు పూర్తి చేయడంతో అకౌంట్ క్రియేట్ కావడంతో దఫదఫాలుగా సుమారు పదకొండుసార్లు మొత్తం రూ.74,36,403 పెట్టుబడి పెట్టాడు. అనంతరం పెట్టిన అమౌంట్ ఫ్రీజ్ అయ్యిందని, విత్‌డ్రా చేయాలంటే మరో రూ.58,55,000 వేయాలని చెప్పడంతో మోసపోయాననే అనుమానంతో బాధితుడు రాజానగరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ జీవీవీ..సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు..

వ్యక్తి అనుమానాస్పద మృతి


నరసింహరాజు మృతదేహం

గోకవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి చెందిన సంఘటనపై గోక వరం పోలీస్ స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం చిన్న కోరుకొండ గ్రామానికి చెందిన రెడ్డిచర్ల నరసింహ రాజు (39) భార్యతో విభేదాల కారణంగా తూర్పుగోదావరి జిల్లా గోకవరం వచ్చి కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. చుట్టు పక్కల గ్రామాల్లో హోమ్ నీడ్స్ వ్యాపారం చేస్తున్నాడు. ఈ క్రమంలో గోకవరం శివారున ఆర్అండ్ఆర్ కాలనీలో ప్లాట్‌ఫామ్‌పై అనుమానాస్పదస్థితిలో నరసింహరాజు మృతిచెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

కొండవాగులో గల్లంతైన యువకుల మృతదేహాలు లభ్యం


యువకుల మృతదేహాల వద్ద పోలీసులు, స్థానికులు

రంపచోడవరం,అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా రంపచోడవరం మన్యం అందాలు తిలకించేందుకు వెళ్లిన కొండవాగులో స్నానానికి దిగి గల్లంతైన ఇద్దరు యువకుల మృతదేహాలు లభ్యమయ్యాయి. ఆదివారం కాకినాడ జిల్లా కరప మండలం ఉప్పలంక గ్రామానికి చెందిన ఓలేటి మణికంఠ, జనన్నాధపురానికి చెందిన పసుపులేటి దుర్గాప్రసాద్ మరో నలుగురు స్నేహితులతో కలిసి రంపచోడవరం మండలంలోని కొత్తపాకలు సమీపంలోని చాపరాయి వద్ద కొండవాగులో స్నానానికి దిగారు. వారిలో మణికంఠ (35), దుర్గాప్రసాద్(35) గల్లంతయ్యారు. మణికంఠ ఫైనాన్స్ వ్యాపారం చేస్తుండగా, దుర్గ ప్రసాద్ పూణెలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. పోలీసు, రెవెన్యూ అధికారులు ఆదివారం గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ మృతదేహాలు లభ్యం కాలేదు. సోమవారం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహాలు లభ్యమవ్వడంతో ఏరియా ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలేజీ బస్సును ఢీకొన్న వ్యాన్

వ్యాన్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు

ఆరుగురు విద్యార్థులకు స్వల్పగాయాలు




దెబ్బతిన్న బస్సు, వ్యాన్ ముందుభాగాలు

దేవరపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటీ కాలేజీ బస్సును బొలేరో వ్యాన్ ఢీకొనడంతో వ్యాన్ డ్రైవర్‌కు తీవ్రగాయాలు కాగా బస్సులో ప్రయాణిస్తున్న 40మంది విద్యార్థుల్లో ఆరుగురికి స్వల్పగాయాలయ్యాయి. ఈ సంఘటన తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం కృష్ణంపాలెం గ్రామశివారులో సోమవారం ఉదయం జరిగింది. తాడేపల్లిగూడెం మండలం పెద తాడేపల్లిలో ఉన్న శ్రీవాసవి ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులతో దేవరపల్లి వైపు నుంచి తాడేపల్లి గూడెం వెళ్తున్న బస్సును విజయవాడ నుంచి కిరణా సరుకులతో వస్తున్న వ్యాన్ వేగంగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. బస్సులో ఆరుగురికి గాయాలు కాగా దేవరపల్లి మండలం బంధపురం గ్రామానికి చెందిన వెంకటరమణకు నుదుటిపై గాయమైంది. గోపాలపురానికి చెందిన సరిపల్లి రోహిత్‌వెంకట సాయికి ముక్కు మీద గాయమైంది. వారికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించారు. వ్యాన్ డ్రైవర్‌కు కాలు విరగడంతో రాజమండ్రి ప్రైవేటు ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ వీ.సుబ్రహ్మణ్యం తెలిపారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కొత్తపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల గ్రామశివారు సేరేపాలానికి చెందిన అరిగెల నాగభూషణం(34) వ్యవసాయ కూలీ. సోమవారం మధ్యాహ్నం మద్యం తాగి ఇంటికి వచ్చి తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అతడి భార్య కేకలు వేస్తు పక్కవారిని పిలిచి గదిలోకి వెళ్లి చూడగా గదిలో ఉన్న ఫ్యాన్‌కు చున్నితో ఉరివేసుకుని వేలాడుతూ కనిపించాడు. స్థానికులు సాయంతో కొత్తపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యులు మృతిచెందినట్టు తెలిపారు. ఎస్ఐ కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని...

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతిచెందినట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. కొత్తపేట మండల పరిధి మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెంకు చెందిన మర్రి చినసత్యనారాయణ(65) ఆదివారం రాత్రి ఇంటి నుంచి రోడ్డుపై నడిచి వెళ్తుండగా వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతుడి కుమారుడు శ్రీనివాసరావు ఫిర్యాదుతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

సామర్లకోట చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం

మళ్లీ తెరపైకి అంశం

కలెక్టర్‌కు 23 మంది కౌన్సిలర్ల

సంతకాలతో వినతి అందజేత

సామర్లకోట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట మున్సిపల్ చైర్ పర్సన్ వైసీపీకి చెందిన గంగిరెడ్డి అరుణపై అదేపార్టీకి చెందిన 23 మంది కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్‌కు సోమవారం వినతిపత్రం అందజేసారు. ఇప్పటికే ఒక పర్యాయం చైర్‌పర్సన్‌పై స్వపక్ష కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఈ ఏడాది 3 ఏప్రిల్ 2025న అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలతో కూడిన ఫిర్యాదు చేశారు. దీనిపై వ్యూహాత్మకంగా వ్యవహరించిన చైర్‌పర్సన్ కోర్టును ఆశ్రయించి మరో పక్క తన చైర్‌పర్సన్ పదవికి రాజీనామా లేఖను మున్సిపల్ కమిషనర్‌కు మే 15న అందజేశారు. అప్పటికే చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ నోటీసులు జారీ చేయడంతో కలెక్టర్ ఆదేశాలతో మే15న కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రత్యేకాధికారిగా కాకినాడ ఆర్డీవో మల్లిబాబును కలెక్టర్ నియమించారు. సమావేశానికి హాజరైన 25 మంది కౌన్సిలర్లు చైర్ పర్సన్ అరుణపై అవిశ్వాసం ప్రకటించారు. అవిశ్వాస ఆరోపణలకు గురైన అరుణ రాజీనామా లేఖ ఉపసంహరించుకుంటున్నట్టు మున్సిపల్ కమిషనర్‌కు అదేరోజు మరో లేఖ అందజేశారు. అవిశ్వాస తీర్మానం నెగ్గినా సమస్య కోర్టులోబడి ఉన్నందున ఫలితం వెల్లడించరాదని ఆదేశించడంతో అప్పట్లో ఫలితాన్ని వెల్లడించలేకపోయారు. మరోవైపు అరుణ తాను విదేశాలకు వెళ్తున్నందున తిరిగి వచ్చేవరకూ తాను సమావేశాలకు హాజరుకాలేనని కమిషనర్‌కు లేఖ అందజేశారు. దీంతో నెలవారీ నిర్వహించాల్సిన 2సమావేశాలను అనిశ్చితపరిస్థితుల్లో నిర్వహించలేకపోయారు. తదనంతరం వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న గోకిన సునేత్రాదేవిని ఇన్‌చార్జి చైర్‌పర్సన్‌గా నియమిస్తూ ఆదేశాలు జూలై 28న రావడంతో 2 సమావేశాలు ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ నెల 1న విదేశాల నుంచి అరుణ తిరిగి స్వగ్రామం చేరుకోవడంతో చైర్‌పర్సన్ వివాదం తిరిగి తెరకెక్కింది. ఈ నెలాఖరున జరుగనున్న కౌన్సిల్ సాధారణ సమావేశం అరుణ అధ్యక్షతన నిర్వహించేందుకు వీలులేదంటూ మరొకసారి 23 మంది కౌన్సిలర్లు సంతకాలు పెట్టి కలెక్టర్‌కు సోమవారం వినతి అందజేశారు. ఈ విషయాన్ని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లగా గత అవిశ్వాసతీర్మాన సమావేశం నిర్దేశాలకు లోబడి జరగలేదని తిరిగి రెండోదఫా ప్రత్యేక సమావేశం నిర్వహించాలని ఉత్తర్వులు జారీ అయినట్లు కమిషనరు శ్రీవిద్య తెలిపారు.

తునిలో మహిళ అదృశ్యంపై కేసు


అదృశ్యమైన సత్యవతి

తుని రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో మహిళ అదృశ్యంపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. బళ్ళంకి సత్యవతి (46) గత కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారని ఎస్ఐ విజయ్‌బాబు పేర్కొన్నారు. ఈనెల 11న ఇంటి నుంచి ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందని, ఆచూకీ తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కుమ్మరి వృత్తిదారుల సమస్యలు సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తా

రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్


ధర్మవరంలో కుమ్మరి వృత్తిదారులను కలిసిన ఈశ్వర్

ప్రత్తిపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కుమ్మరి వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని రాష్ట్ర కుమ్మరి శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ చెప్పారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరంలో సోమవారం ఆయన పర్యటించి కుమ్మరి కులవృత్తిదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో అనంతపురం, పార్వతీపురం, అనకాపల్లి, కాకినాడ తదితర జిల్లాలో పర్యటించామన్నా రు. అన్ని చోట్ల ప్రధానంగా మట్టి, పనిముట్లు, పాత్రలు కాల్చే ఆములు, షెడ్లు, స్థలాలు, 50 ఏళ్ల పైబడిన కుల వృత్తిదారులకు పెన్షన్‌లు కావాలని వంటి సమస్యలు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. త్వరలో వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబు వద్ద నివేదించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కుల వృత్తిదారులకు కార్పొరేషన్ చైర్మన్ హామీ ఇచ్చారు. ఆయన వెంట శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ భీమాబత్తుల సత్యనారాయణ, సంఘ నాయకులు స్వయంభారపు వెంకటరమణ, అనకాపల్లి అప్పారావు, అనకాపల్లి నాగేశ్వరరావు, ఉబ్బిశెట్టి నారాయణరావు, పి.అప్పారావు, టిల్లంపూడి బాలాజీ తదితరులున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

ప్రజల అవసరాలకు అనుగుణంగా 'ఉపాధి' పనులు

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపడుతున్నట్టు గొల్లప్రోలు ఎంపీడీవో సెలట్‌రాజు తెలిపారు. ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టే పనుల గుర్తింపు కోసం దుర్గాడలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఏపీవో గంగాభవానీ, ఉప సర్పంచ్ పంపన సూర్యచంద్రరావు, గొల్లపల్లి గంగాఈశ్వరుడు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


పీసీ-పీఎన్‌డీటీ చట్టంపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పీసీ-పీఎన్‌డీటీ చట్టంపై అవగాహన

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కౌమార దశకు వచ్చిన విద్యార్థులు ప్రీ కన్సెప్షన్ అండ్ ప్రీ నేటల్ డయాగ్నోస్టిక్ టెక్నిక్స్ (పీసీ అండ్ పీఎన్‌డీటీ) చట్టంపై అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ కోరారు. సేవ్ గర్ల్ చైల్డ్‌నార్మ్ పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌పై అవగాహన వారోత్సవాల్లో భాగంగా హైస్కూళ్లు, కళాశాలల విద్యార్థులకు, ప్రజలకు ఈ చట్టంపై మరింత అవగాహన కల్పిస్తామన్నారు. స్కాన్ సెంటర్లు, జన్యు ప్రయోగశాలలను తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహించే స్కానింగ్ కేంద్రాలు, అర్హత లేని వైద్యుల వివరాలను టోల్‌ఫ్రీ నెంబరు 18004253365 లేదా వాట్సాప్ నెంబరు 9494113365 ఫోను ద్వారా గానీ లిఖితపూర్వకంగా గానీ తెలియజేస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎంహెచ్‌వో డాక్టర్ నాయక్ వెల్లడించారు. డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

'సూపర్ జీఎస్టీ ఫలాలు ఇంటింటికీ అందాలి'


జీఎస్టీ కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప

పెద్దాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సూపర్ జీఎస్టీ ఫలాలు ఇంటింటికీ అందాలని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి వర్గాలకు, రైతులకు, ఆరోగ్య రంగానికి ఈ నిర్ణయాలు గణనీయమైన ఉపశమనం కల్పిస్తాయని ఆయన చెప్పారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరిట నిర్వహించిన పట్టణంలో సోమవారం నిర్వహించిన ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు మేలు కలగడమే కాకుండా వ్యాపారాలు ఊపందుకుంటాయన్నారు. కార్యక్రమంలో కూటమి నేతలు పలువురు పాల్గొన్నారు. ఎంపీడీవో కె.సూర్యనారాయణ ఆధ్వర్యంలో పలువురు మోటారు సైకిళ్లపై పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

టౌన్‌హాల్ కమిటీ ప్రతినిధులకు సత్కారం


టౌన్‌హాల్ కమిటీ ప్రతినిధులను సత్కరిస్తున్న దృశ్యం

కాకినాడ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నూతనంగా ఎన్నికైన ది లిటరరీ అసోసియేషన్ కాకినాడ టౌన్‌హాల్ కమిటీ ప్రతినిధులను రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రోటరీ హాలులో సోమవారం ఏర్పాటుచేసిన ప్రత్యేక సమావేశానికి క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ అధ్యక్షత వహించారు. టౌన్‌హాల్ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన రోటరీ గోల్డెన్ జూబ్లీ క్లబ్ పూర్వాధ్యక్షుడు వి.ఆనంద్, కోశాధికారిగా ఎన్నికైన క్లబ్ సీనియర్ సభ్యుడు నెక్కంటి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యుడు దంగేటి ప్రసాద్‌లను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ ఈ నెల 26న విజయనగరంలో జరిగే రోటరీ ఫౌండేషన్ సెమినార్‌కు అధిక సంఖ్యలో సభ్యులు తరలివెళ్లాలన్నారు. రోటరీ ఫౌండేషన్‌కు ఇప్పటివరకు 2వేల డాలర్లు సమీకరించామన్నారు. సమావేశంలో రోటరీ అసిస్టెంట్ గవర్నర్ అప్పసాని కృష్ణకుమారి, క్లబ్ కార్యదర్శి డాక్టర్ సానా ప్రవీణ్, కోశాధికారి ఉదయ చక్రవర్తి, పూర్వ అధ్యక్షుడు ఉదయభాను, పూర్వ కోశాధికారి గోవిందరాజులు, నరహరిశెట్టి రవికృష్ణ, చిరంజీవిరెడ్డి, దాసరి సాయికృష్ణ, గొడవర్తి సత్యమూర్తి, నేతి నాగేశ్వరరావు, టేకుమూడి సూర్యనారాయణ, దుర్గాప్రసాద్, పరశురాం, హరిదత్త కుమార్, లంక సాయిబాబు, మాజేటి పవన్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ ఎమ్మెల్యే వర్మతో ఆటో యూనియన్ ప్రతినిధులు

ఆటో డ్రైవర్ల సంక్షేమానికి ప్రాధాన్యం: వర్మ

పిఠాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పట్టణంలో నూతనంగా ఎన్నికైన ఆటో యూనియన్ ప్రతినిధులు సోమవారం టీడీపీ కార్యాలయంలో వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. వారిని ఆయన అభినందించి అన్ని విధాలా అండగా ఉంటానని హామీనిచ్చారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బొజ్జా సతీష్, గిరీష్‌వర్మ పాల్గొన్నారు.

'స్థానిక'ఎన్నికల్లో బీసీలకు 22శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ యనమదల రవి

కాకినాడ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ వర్తింపజేయాలని రాష్ట్ర బీసీ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ యనమదల రవి డిమాండ్ చేశారు. కొండయ్యపాలెంలోని బీసీ సంఘ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం బీసీలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ఎస్సీ, ఎస్టీలకు మాదిరి బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం తెస్తామని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఏడాదిన్నర గడచినా దాని ఊసే మరిచిందన్నారు. చట్టసభల్లో 33 శాతం, నామినేటెడ్ పదవుల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఇచ్చిన మరో హామీపై ఎటువంటి కదలిక లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను మూడు నెలల ముందే నిర్వహిస్తామని ఎన్నికల కమిషన్ చెప్తుంటే ఇంతవరకు బీసీ కులగణన చేపట్టకపోవడం బీసీలకు అన్యాయం చేయడమే అవుతుందన్నారు. సమావేశంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి పెంకే రాజు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు అనుసూరి సతీష్, నాయకులు పెంకే శివ, వాసంశెట్టి మహేష్, పెంకే వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2కోట్లతో ఉపాధి పనుల ఆమోదానికి గుర్తింపు



తాళ్లరేవు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పి.మల్లవరం పంచాయతీ పరిధిలోని ఆవాస గ్రామాల్లో 2026-27లో రూ.2కోట్లతో ఉపాధి హామీ పనులు చేసేందుకు ఎంజీఎన్ఆర్ఈజీఎస్ అధికారులు గుర్తించారు. సోమవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ పంపన రామకృష్ణ అధ్యక్షతన పనుల ఆమోదానికి గ్రామసభ నిర్వహించారు. ఎంపీటీసీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్, వుంగరాల వెంకటేశ్వరరావు, టెక్నికల్ అసిస్టెంట్ సరస్వతి, సూర్యకుమారి పాల్గొన్నారు.




గొల్లప్రోలులోని రాయవరం సెంటర్లో రోడ్డుపై నిలిచిన నీరు, పిఠాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో కూలిన చెట్టు, సామర్లకోటలో జలమయమైన ఓ వీధి

కుండపోత వర్షం

రహదారులు జలమయం
పొంగిపొర్లిన డ్రైన్లు

పిఠాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో కుండపోత వర్షం కురిసింది. ఎక్కడికక్కడ రహదారులు జలమయమయ్యాయి. పలుచోట్ల పాఠశాలల ఆవరణలు జలశయాలను తలపించాయి. పట్టణంలో సోమవారం తెల్లవారుజాము నుంచి ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. తెల్లవారుజామున 4.45 నుంచి ఉదయం 9గంటల వరకు రెండు విడతలుగా ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోయింది. ఎక్కడిక్కడ డ్రైన్లు పొంగిపొర్లి ప్రవహించాయి. ఉప్పాడ సెంటర్, సీతయ్యగారితోట, విద్యుత్ నగర్, సినిమా సెంటర్, పాతబస్టాండు, అంబేద్కర్ సెంటర్, ఫైర్ స్టేషన్, ప్రభుత్వాసుపత్రి, తహసీల్దారు కార్యాలయం సెంటర్లు, ఆర్టీసీ కాంప్లెక్సు, తారకరామనగర్, వైఎస్సార్ గార్డెన్స్, చర్చి సెంటర్, మంగాయమ్మరావుపేట తదితర ప్రాంతాల్లో రోడ్లపై రెండు అడుగుల ఎత్తున నీరు ప్రవహించింది. మున్సిపల్ బాలికోన్నత పాఠశాలకు వెళ్లే మార్గాలన్నీ జలశయాలను తలపించాయి. పాతబస్టాండు మున్సిపల్ ఉన్నత పాఠశాల, ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వాసుపత్రి, క్రీడా మైదానంల్లో భారీగా నీరు నిలిచిపోయింది. ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

ఉదయం, సాయంత్రం వీచిన ఈదురుగాలులతో పిఠాపురం ఆర్టీసీ కాంప్లెక్సు సమీపంలో చెట్టు నేలకూలింది. ప్రధాన రహదారిపై చెట్టు పడిపోవడంతో సాయంత్రం ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో వాహనచోదకులు ఇక్కట్లు పడ్డారు. పోలీసులు వచ్చి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులో భారీ వర్షం కురిసింది. డ్రైన్లు పొంగిపొర్లి రోడ్లపై నీరు ప్రవహించింది. ప్రధాన రహదారిలో డ్రైన్లు ఆక్రమించి కట్టడాలు నిర్మించడంతో నీరు పోయే మార్గాలు లేక రాయవరం సెంటర్, తదితర ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. భారీ శబ్దాలతో ఉరుములతో పాటు పట్టణ శివారు ప్రాంతాల్లో పిడుగులు పడటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు.

పిఠాపురం రూరల్ (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో విరవాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణ, పరిసర ప్రాంతాలు జలశయాన్ని తలపించాయి. పాఠశాల ఆవరణలో నిలిచిపోయిన వర్షపు నీటిలోనే విద్యార్థులు రాకపోకలు సాగించారు.

గొల్లప్రోలు రూరల్ (ఆంధ్రజ్యోతి): చేబ్రోలులో మూడు గంటల పాటు కురిసిన భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. మార్కెట్ వీధి, ఇతర ప్రాంతాల్లో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపై నీరు నిలిచిపోయి గృహాల్లోకి చేరింది. ఇళ్లల్లోకి చేరిన నీటిని తోడుకునేందుకు అక్కడి ప్రజలు తీవ్ర అవస్థలు పడ్డారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట పట్టణంలోను, మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం కురిసింది. పట్టణంలో పలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. ఆర్టీసీ కాంప్లెక్స్, జయలక్ష్మి థియేటర్ రోడ్డు, ప్రకాష్‌నగర్, ప్రెసిడెంట్ గారి వీధి, వీర్రాఘవపురం, వెలమపేట ప్రాంతాల్లో మురుగునీరు రోడ్డుపై నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందిపడ్డారు. రైల్వే స్టేషన్లో ప్లాట్‌ఫాంలపై షెడ్ల నుంచి వర్షం నీరు లీకుల కారణంగా ప్రయాణికులు లగేజీలతో తడిసి ముద్దయ్యారు. ప్రయాణికులు తమ గమ్య స్థానాలకు వెళ్లాల్సిన రైళ్లు ఎక్కేందుకు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు. ఈ వర్షం ఖరీఫ్ వరి పంటకు ఎంతగానో మేలు చేకూరుస్తుందని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేశారు. పంట ప్రస్తుత సమయంలో కొన్ని గ్రామాల్లో చిరుపొట్ట, గింజపాలు పోసుకునే దశల్లో ఉన్నందున ఇప్పటికే ఆశించిన చీడపీడలు తొలగిపోయే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. నీటి తడుల కోసం ఎదురుచూస్తున్న కూరగాయల పంటలకు, మెట్ట ప్రాంతాల్లో సాగవుతున్న కర్రపెండలం, పామాయిల్ వంటి ఉద్యాన పంటలకు ఈ వర్షాలతో అదనపు నీటి తడులు అందాయని రైతులు చెప్పారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం తెల్లవారుజామున కుండపోతగా కురిసిన వర్షానికి పలు గ్రామాల్లో రోడ్లు నిండా మునిగాయి. మెరుపులు, పిడుగులతో పెద్ద వర్షం కురిసింది. నీటిప్రవాహ వేగానికి డ్రైన్లలో చెత్తాచెదారాలు కొట్టుకుపోయాయి. 60.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని మండల సహాయ గణాంకులు రామచంద్రమూర్తి చెప్పారు. ఇటీవల వర్షాలు అంతగా కురవకపోవడంతో సార్వా చేలను చీడపీడలు ఆశించాయి. సోమవారం కురిసిన భారీ వర్షం సార్వా చేలకు ఉతమిచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

'సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్‌పై దాడి అమానుషం'



కలెక్టరేట్ ఎదుట నల్ల జెండాలతో నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులు

కాకినాడ సిటీ, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): 'సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌పై దాడి అమానుషం... దాడికి పాల్పడిన రాకేష్‌కుమార్‌పై తక్షణం కేసు నమోదు చేసి అరెస్టు చేయాలి.... ఈ ఘటన వెనుక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలి' అని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ, ఎంఈఎఫ్, ఎంఎల్ఎఫ్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ వద్ద నల్ల జెండాలతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఇటువంటివి పునరావృతం కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలన్నారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జిలతో సమగ్ర విచారణ జరిపించాలన్నారు. అనంతరం అధికారులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, కాకినాడ జిల్లా ఇన్‌చార్జి పసుపులేటి చిన్నబాబు, రాష్ట్ర కార్యదర్శి కాకాడ నూకరాజు, జిల్లా సహ ఇన్‌చార్జిలు వల్లూరి సత్తిబాబు, అనంతపూర్ రాజు, ఎంఎస్పీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పలివెల నవీన్, జిల్లా కో-ఇన్‌చార్జి దేవవరపు సురేష్, పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి అరసాల హరిబాబు, కరప మండల ఇన్‌చార్జి పలివెల రమేష్, కాకినాడ రూరల్ మండల ఇన్‌చార్జి తాతపూడి దివాకర్, పిఠాపురం మండల అధ్యక్షుడు బి.లక్ష్మణ్, మిరియాల వీరబాబు, మోతుకూరి వరలక్ష్మి, తుమ్మలపల్లి చిన్న పాల్గొన్నారు.


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు

గోల్డెన్ అవర్‌లో గొప్ప ప్రాణ రక్షణ ప్రక్రియ 'సీపీఆర్'

జీజీహెచ్ (కాకినాడ), అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రంగరాయ వైద్య కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో సీపీఆర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఎస్ఎస్‌సీ చక్రరావు మాట్లాడుతూ సీపీఆర్ అనేది గోల్డెన్ అవర్‌లో ఓ గొప్ప ప్రాణ రక్షణ ప్రక్రియ అన్నారు. చదువుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ నేర్చుకోవాల్సిన ఒక సరళమైన ప్రక్రియ అన్నారు. సదస్సుకు హాజరైన వైద్య విద్యార్థులకు సీపీఆర్‌లోని మెళకువలు నేర్పారు. డాక్టర్ విష్ణువర్ధన్ సీపీఆర్ అవగాహన ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శశి, డాక్టర్ ముఖర్జీ, డాక్టర్ అనంద్, అనస్తీషియా హెచ్‌వోడీ డాక్టర్ జి.ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ అన్నారు. ఈ నెల 17వ తేదీ వరకు పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీల్లో సీపీఆర్ అవగాహన వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. సీపీఆర్ మెళకువలను నేర్పించడం, వీధుల్లో సీపీఆర్ ప్రదర్శిస్తూ ప్రజలకు అవగాహన కల్పించడం, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించడం చేయలాన్నారు. డీఐవో డాక్టర్ కేవీ సుబ్బరాజు పాల్గొన్నారు.

'పాడా' పీజీఆర్ఎస్‌కు సమస్యల వెల్లువ


'పాడా' పీడీ వేణుగోపాలరావుకు వినతిపత్రం అందజేస్తున్న పట్టణ ప్రజలు

పిఠాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాడా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో... రోడ్లు, డ్రైన్లు అభివృద్ధి చేయాలని, వర్షం, మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని, దోమల బెడద నివారించాలని పాడా పీడీ వేణుగోపాలరావుకు వినతిపత్రాలు అందజేశారు. పట్టణాలు, గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు సాగుతున్నాయని, బెల్ట్‌షాపులను అరికట్టాలని మద్యపాన వ్యతిరేక ప్రచార కమిటీ ప్రతినిధులు పీడీకి ఫిర్యాదు చేశారు. మొత్తం 38 అర్జీలు అందాయి. వీటిని తక్షణం పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులను పీడీ ఆదేశించారు. మూడు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా...

ఏళ్లు గడుస్తున్నా ఇళ్ల పట్టాల స్థలాలు చూపించకపోవడాన్ని నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో పాడా కార్యాలయం వద్ద లబ్ధిదారులు ధర్నా నిర్వహించారు. పట్టణంలో 5,030 మందికి ఇళ్లస్థల పట్టాలు ఇచ్చి నాలుగేళ్లు దాటిందన్నారు. ఇప్పటివరకు ఒక్కరికి కూడా స్థలం అప్పగించలేదని చెప్పారు. ఈ విషయమై ప్రశ్నిస్తుంటే ఏ అధికారీ సమాధానం చెప్పట్లేదన్నారు. కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చిన విధంగా రెండు సెంట్లు వంతున స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ కార్యదర్శి సాకా రామకృష్ణ, కేతా అరుణ, రాజాల నాగేశ్వరరావు, సుజాత, చెరుకూరి లలితమ్మ, గణపతి, మర్రి పాదాలు తదితరులు పాల్గొన్నారు.

మార్పునకు నాంది పలుకుదాం... కలసిరండి

జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ దుర్గారాణి


సదస్సులో మాట్లాడుతున్న కౌన్సిలర్ దుర్గారాణి

పిఠాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సమాజంలో అన్నింటా తాము ముందుంటామనే మార్పునకు నాంది పలుకుదామని, దీనికి అందరూ కలిసి రావాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలరు బి.దుర్గారాణి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలిక దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా బాలికగా నాతోనే మార్పు.. ముందుకు రండి నినాదంతో పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికల రక్షణకు ఉన్న చట్టాలు, ఆర్థికంగా ఉన్నతి సాధించడం తదితర అంశాలను వివరించారు. పలు పాఠశాలల్లో విద్యార్థినులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్ఎస్‌కే దుర్గాదేవి, సూపర్‌వైజరు అరుణ, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ స్టేషన్ వద్ద వైసీపీ ధర్నా

పిఠాపురం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని అరికట్టి ప్రజల ప్రాణాలు కాపాడాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఎక్సైజ్ స్టేషన్ వద్ద సోమవారం వైసీపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నకిలీ మద్యం దందాపై విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బెల్ట్‌షాపులు, పర్మిట్ రూమ్‌లను తక్షణం రద్దు చేయాలని కోరారు. ఆందోళనలో కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్, జిల్లా పరిషత్ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



దుర్గాడ శివాలయంలో అన్నాభిషేకం

గొల్లప్రోలు రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయంలో సోమవారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరిగింది. అనంతరం 121 కిలోల బియ్యంతో వండిన అన్నంతో అన్నసూక్తం మహా మంత్రంతో అన్నాభిషేకం జరిపించారు. అన్నం పండించే రైతు బాగుండాలి, దేశంలో, రాష్ట్రంలో ఆహార ధాన్యాలకు లోటు లేకుండా సమృద్ధిగా పంటలు పండాలని ఈ కార్యక్రమం నిర్వహించినట్టు అలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు, సేవాసమితి సభ్యులు తెలిపారు. అన్నాభిషేకాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.


దొరస్వామినాయక్‌ను అభినందిస్తున్న ప్రొఫెసర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు

ఏఐబీఎస్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా దొరస్వామినాయక్

జేఎన్టీయూకే, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత బంజారా సేవా సంఘం (ఏఐబీఎస్ఎస్) కాకినాడ జిల్లా అధ్యక్షుడిగాజేఎన్టీయూకే గ్రంథాలయశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బీఆర్ దొరస్వామినాయక్, సాధారణ కార్యదర్శిగా బి.బాలునాయక్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన సమావేశం అనంతరం దొరస్వామినాయక్‌ను మెకానికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ విభాగాల ప్రొఫెసర్లు బి.బాలకృష్ణ, ఎం.రమేష్, రవాణా శాఖ అధికారి ఆర్బీ నాయక్, మురళీనాయక్ అభినందించారు.

భావనారాయణ స్వామి హుండీల ఆదాయం రూ.6.07 లక్షలు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): సర్పవరంలోని రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణస్వామి ఆలయంలోని హుండీలను దేవదాయ శాఖ తనిఖీదారు వి.ఫణీంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఈవోలు ఎంఎం వీరభద్రరావు, కేవీవీ వేణుగోపాలరావుల పర్యవేక్షణలో తెరిచి లెక్కించారు. ఏడు నెలలకు రూ. 6,07,574 ఆదాయం లభించినట్టు ఈవో టీవీ సూర్యనారాయణ తెలిపారు. భక్తులు, గ్రామ పెద్దలు, పూజారులు పాల్గొన్నారు.


ప్రముఖుల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్

వాకలపూడిలో 'ఆత్మ నిర్భర్ భారత్'

సర్పవరం జంక్షన్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పరిపాలనలో సంస్కరణలు, పారిశ్రామికీరణ, వ్యవసాయానికి సంపూర్ణ తోడ్పాటు ద్వారా ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్‌ను ప్రథమ స్థానంలో నిలిపేందుకు ప్రధాని మోదీ 'ఆత్మ నిర్భర్ భారత్'కు శ్రీకారం చుట్టారని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ తెలిపారు. సోమవారం వాకలపూడిలో ఆత్మనిర్భర్ భారత్ మండల కన్వీనర్ కందికట్ల శివకుమార్ ఆధ్వర్యంలో పలువురు ప్రముఖుల చిత్రపటానికి నివాళులర్పించారు. మండల శాఖ అధ్యక్షుడు నందూరి సత్తిబాబు, పాలిక శివ, బందరు అజయ్, భద్రం, ఉమ్మిడి శ్రీను, లీలావతిపాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దారుపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు

కొత్తపల్లి, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి డిప్యూటీ తహసీల్దారు మురళీకృష్ణపై పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినట్టు బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు వాసంశెట్టి శ్రీనివాస రావు తెలిపారు. ఎఫ్ఎంసీ, భూమి తగాదా విషయాలు, సర్టిఫికెట్ల మంజూరుకు ప్రజల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేసి డిప్యూటీ తహసీల్దారుపై చర్యలు తీసుకోవాలని కోరారు.

మహారాజశ్రీ కాకినాడ 2వ అదనపు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
H.M.O.P. No.83/2025
Between:
దేశంశెట్టి కాశీ శ్రీరామ్ ...పిటిషనర్
మరియు
దేశంశెట్టి రమ్య ...రెస్పాండెంట్
To:
దేశంశెట్టి రమ్య, W/o. దేశంశెట్టి కాశీ శ్రీరామ్, D/o. లేటు కర్రి వెంకట సుబ్బారావు, C/o. కర్రి నాగరత్నం, డో.నెం.3-130, పెద్దవీధి, గొల్లపాలెం గ్రామం, కాజులూరు మండలం, కాకినాడ జిల్లా.
పై నెంబరు కేసులో పిటిషనరు తన భార్య అయిన మీపై విడాకులు కోరుతూ పిటిషను దాఖలా చేసియున్నారు. సదరు కేసులో శ్రీ కోర్టువారి ద్వారా మీకు సమన్లు పంపించినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.28-10-2025వ తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ 10.30 ని॥లకు పై శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజరయి, మీ యొక్క అక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
నల్లం వేణుగోపాలరావు
వాసిరెడ్డి కొండలవారు
అడ్వకేట్లు, కాకినాడ, సెల్: 9949411285

ఆర్థిక సాయం

జగ్గంపేట, అక్టబరు 13(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం కొత్తూరులో నిరుపేద కుటుంబానికి తలారి రాజు చెందిన దీర్ఘకాలిక అనారోగ్యంతో మంచాన్ని పట్టి బాధపడుతుండడంతో జగ్గంపేటకు చెందిన మణికర్ణిక ఆర్గనైజేషన్ ద్వారా 2 నెలలకు సరిపడా కిరాణా సరుకులు అందించారు. కార్యక్రమంలో మణికర్ణిక ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గున్నా బత్తుల పూజా అనూష, వైస్ ప్రెసిడెంట్ మొగలంక శ్రీనివాస్, సభ్యులు చిక్కాల మణికంఠ పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం ప్రకటించాలి

● ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో ఐటీడీఏ ముట్టడి

● నాలుగు గంటలపాటు స్తంభించిన ట్రాఫిక్



ఐటీడీఏ పీవోతో మాట్లాడుతున్న ఆదివాసీ సంఘాల జేఏసీ నాయకులు

రంపచోడవరం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం తక్షణమే ప్రకటించి ప్రత్యేక ఆదివాసీ డీఎస్సీ ప్రకటించాలని, ఆదివాసీ హక్కులు, చట్టాలు పటిష్టంగా అమలుచేయాలని కోరుతూ ఆదివాసీ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. తొలుత ఆదివాసీ సంఘాలు, ఆదివాసీ హక్కులు, ఉద్యోగాల సాధన కమిటీ ఆధ్వర్యంలో ఐటీడీఏ కార్యాలయంను ముట్టడించి భారీధర్నా నిర్వహించారు. సుమారు నాలుగు గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా ఆదివాసీ సంఘాల నాయకులు తెల్లం శేఖర్, వంతు బాలకృష్ణ, కంగల శ్రీనివాస్, మడకం బంగారుబాబు, లోతా రామారావు, రాజ్‌కుమార్, టి.పద్మ, మద్దేటి అంజిరెడ్డి, సిరిమల్లిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఆదివాసీ నిరుద్యోగులకు నూరు శాతం ఉద్యోగాలు ఆదివాసీ నిరుద్యోగులతో భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని అమలుచేసి ట్రైబల్ అడ్వైజరీ కౌన్సిల్ ద్వారా తీర్మానంచేసి షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగాల నియామకాల చట్టం ప్రకటించాలన్నారు. ప్రత్యేక ఆదివాసీ డీఎస్సీ నోటిఫికేషన్, ఆదివాసీ ప్రాంతంలో ఉన్న 1/59, 1/70, పీసా, అటవీహక్కు, పోలవరం భూసేకర తదితర చట్టాలు పటిష్టంగా అమలు చేయాలని భారీ ర్యాలీ చేసి ఐటీడీఏను ముట్టడించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు జి.లోవ ప్రసాద్, రత్నాకర్, ఎం.సూర్యకుమారి, సీహెచ్ శశిప్రీతం, కారం రామన్నదొర, యలగాడ నాగేశ్వరరావు, కోసు లచ్చన్నదొర, కత్రం దాసు, ఎస్.బాబురావు, సీహెచ్ సన్యాసిరెడ్డి, సీహెచ్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి వివరణ

సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో వివిధ ఆది వాసీ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సమస్యలపై ప్రభుత్వానికి లేఖ రూపంలో నివేదించినట్టు ఐటీడీఏ పీవో స్మరణ్ రాజ్ తెలిపారు.

ఆదివాసీ హక్కుల ఉద్యోగాల సాధన కమిటీకి మద్దతు

దేవీపట్నం, అక్టోబరు13(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ హక్కుల ఉద్యోగాల సాధన కమిటీకి దేవీపట్నం మండల ఆదివాసీ అధ్యక్షుడు విద్యాసాగర్ మద్దతు తెలిపారు. సోమవారం రంపచోడవరంలో జరిగిన శాంతియుత ధర్నాలో ఆయన పాల్గొన్నారు.

ఐటీడీఏ గ్రీవెన్స్‌కు 53 అర్జీలు



రంపచోడవరం, అక్టోబర్ 13(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఐటీడీఏ పీవో స్మరణ్‌రాజ్, సబ్ కలెక్టర్ శుభం నొక్వాల్, ఏజీవో(జీ) డీఎన్వీ రమణ, డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, సబ్‌కలెక్టర్ కార్యాలయ పరిపానాధికారి ఎం.సావిత్రి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీవో మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం తరగతులు నిర్వహించేందు అనుమతి మంజూరు, భూ సమస్యలు పరిష్కరించాలని తదితర సమస్యలపై సుమారు 53 అర్జీలు అందాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏడీఎంహెచ్‌వో డేవిడ్, పీహెచ్‌వో దేవదానం, జీసీసీ డీఎం విజయశ్రీ, ఏపీడీ శ్రీనివాస్ విశ్వనాథ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డెంగీ జ్వరపీడితులకు చికిత్స

ఎటపాక, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ఎటపాక మండలం లక్ష్మీపురం గ్రామంలోని ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి డెంగీ జ్వరపీడితులకు లక్ష్మీపురం పీహెచ్‌సీలో చికిత్స అందినట్టు వైద్యాధికారి మురళీకృష్ణ తెలిపారు. బుద్దుల నాగేశ్వరరావు కుటుంబంలోని అతని భార్య, కూతురు, కుమారుడికి ఐదురోజుల తీవ్రజ్వరం రావడంతో ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. జ్వరం తగ్గకపోవడంతో స్థానిక లక్ష్మీపురం పీహెచ్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయగా, నలుగురికి డెంగీ పాజిటివ్‌గా తేలింది. దీంతో వైద్యా ధికారి పర్యవేక్షణలో వైద్య చికిత్స అందించారు. దీంతో వారు కోలుకోవడంతో సోమవారం పీహెచ్‌సీ నుంచి డిశ్చార్జ్ అయ్యారు.

స్వచ్ఛ సేవకు అంగన్‌వాడీ కార్యకర్తకు పురస్కారం



ఎటపాక, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రంలో స్వచ్ఛ సేవకు, పరిశుభ్రతకుగానూ కృష్ణవరం అంగన్‌వాడీ కార్యకర్త జింగా కృష్ణవేణికి ప్రతిభా పురస్కారం లభించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వర్ణఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కృష్ణవరం అంగన్‌వాడీ కేంద్ర ం ఎంపికైంది. దీంతో అంగన్‌వాడీకార్యకర్తకు ప్రశంసా పత్రం, జ్ఞాపికను సీడీపీవో అరుణ నుంచి ఆమె అందుకున్నారు. మండలంలో 112 అంగన్‌వాడీ కేంద్రాలో కృష్ణవరం అంగన్‌వాడీ కేంద్రం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర అవార్డుకు ఎంపిక కావడం విశేషం.

నూతన ఉపాధ్యాయులు విధుల్లో చేరిక

చింతూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ 2025కు చెందిన 49మంది ఉపాధ్యాయులు సోమవారం చింతూరు మండలంలోని వివిధ పాఠశాలల్లో విధు ల్లో చేరారు. ఎంఈవో జి.వెంకటేశ్వరరావు చేరిక పత్రాలు అందజేశారు.

కూనవరం(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో మెరుగైన ఫలితాలు సాధించి ఉపాధ్యాయ పోస్టులు సాధించారు. కూనవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 11మంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, ఇద్దరు కోతులగుట్ట పాఠశాలలో ఐదుగురు ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు.

మోతుగూడెం(ఆంధ్రజ్యోతి): మోతుగూడెం జడ్పీ పాఠశాలలో కొత్తగా ఎంపికైన ముగ్గురు ఉపాధ్యాయులు బాధ్యతలు స్వీకరించారు. పాఠశాలలో అన్ని సబ్జెక్టులకు సంబంధించిన టీచర్స్ ఉన్నందున సంతోషంగా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.సోమ్నాస్,ఉపాధ్యాయులు తెలిపారు.

వీఆర్‌పురం(ఆంధ్రజ్యోతి): వీఆర్‌పురం మండలానికి 29మంది నూతన ఉపాధ్యాయులను ప్రభుత్వం నియ మించింది. 29 మంది ఉపాధ్యాయులకుగాను 27 మంది ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరినట్లు మండల విద్యాశాఖాధికారి (2) బాబూరావు తెలిపారు. 20 మంది ఎస్‌జీటీలు, 9మంది పాఠశాలు అసిస్టెంట్‌లను నియమంచారని ఆయన తెలిపారు.

రాజవొమ్మంగి(ఆంధ్రజ్యోతి): ఇటీవల మెగా డీఎస్సీ ద్వారా ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులు సోమవారం విధుల్లో చేరారు. రాజవొమ్మంగి మండలంలో 17మంది నూతన ఉపాధ్యయులు సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు మండల విద్యాశాఖఅధికారి సత్యనారాయణ దొర తెలిపారు.

ఎటపాక(ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన ఉపాధ్యాయులకు పాఠశాల విద్యాశాఖ అధికారులు పోస్టింగ్‌లు ఇవ్వడంతో సోమవారం ఎటపాక మండలంలో ప్రభుత్వ పాఠశాల్లో 30 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. అయితే మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో 23మంది ఎస్జీటీ ఉపాధ్యాయులు చేరగా, మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో ఏడుగురు స్కూల్ అసిసెంట్ ఉపాధ్యాయలు విధుల్లో చేరారు.

'రాష్ట్రంలో కల్తీ మద్యం ఏరులై పారుతోంది'

రంపచోడవరం, అక్టోబర్ 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వ పాలనలో కల్తీ మద్యం ఏరులా పారుతోందని ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. ఈ మేరకు సోమవారం రంపచోడవంలో వైసీపీ నాయకులు, కార్యకర్తలతో ర్యాలీగా వెళ్లి ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో 11 మండలాల వైసీపీ మండలాధ్యక్షులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రజాప్రతినిధులను పట్టించుకోవడం లేదు

● తుని మండల పరిషత్ సమావేశం



సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఏపీవో

తుని రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయం లో సోమవారం మండల పరిషత్ సమావేశం ఎంపీపీ బొప్పన రాము అధ్యక్షతన జరిగింది. మండలానికి చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు హాజరయ్యారు. మండలంలో పలు సమస్యలు చర్చకు రాగా అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు ధ్వజమెత్తారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులను పట్టించుకోవడం లేదని, గ్రామ పంచాయతీల్లో తీర్మానాలు వంటి కీలక విషయాల్లో కూడా కార్యదర్శులు తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. ముఖ్యంగా తిమ్మాపురం, కొలిమేరు, తాళ్ళూరు గ్రామాల్లో తాగునీటి సమస్యపై సంబంధిత శాఖా అధికారులతో చర్చించారు. తాళ్ళూ రులో తాగునీటి పైపులైన్లు పగుళ్లతో డ్రైన్ వాటర్ కలుస్తుందని, అధికారులకు చెప్పినా పట్టించుకోలేదన్నారు. పలు గ్రామాల్లో విద్యుత్‌లో ఓల్టేజ్ సమస్యపై చర్చ జరగా పరిష్కారానికి సంబంధిత అధికారులు హామీ ఇచ్చారు. మండలంలోని మినీ గోకులాల్లో అవకతవకలు జరుగుతున్నాయని వైస్ ఎంపీపీ ప్రస్తావించగా ఎంపీడీవో కలగచేసుకుని అటువంటివి ఏమైనా ఉంటే ఆధారాలతో సంప్రదించాలని తెలిపారు. ఎంపీడీవో సాయి నవీన్, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

ఆత్మ కమిటీ సభ్యులకు అభినందన



నేతలను అభినందిస్తున్న మేడిశెట్టి బాబి

శంఖవరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభు త్వం ఏర్పాటు చేసిన ఆత్మ (వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ) కమిటీ వైస్ చైర్మన్‌గా జనసేన నేత కరణం సుబ్రహ్మణ్యం, సభ్యులుగా తుమ్మల సత్యేంద్రనాద్, పల్లా శ్రీను ఎంపికయ్యారు. వారిని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి సూర్యకిరణ్ అభినందించారు. సోమవారం కత్తిపూడిలో తన స్వగృహంలో వారిని అభినందనలు తెలిపారు. దిశ కమిటీ సభ్యురాలిగా ఎంపికైన జర్తా సరస్వతిని సత్కరించారు. పార్టీలో కష్టపడిన ప్రతీ ఒక్కరికీ తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన నేతలు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ సునీత

ఏలేశ్వరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇంచార్జ్ ప్రయాగమూర్తి నేతృత్వంలో సోమవారం పలు అంశాలపై అవగాహన నిర్వహించారు. ప్రిన్సిపాల్ సునీత మాట్లాడారు. రామారావు, మదీనా, శివ ప్రసాద్, బంగార్రాజు, శ్రీలక్ష్మీ, రాజేష్, ధర్మరాజు పాల్గొన్నారు.

అన్నదానం

కిర్లంపూడి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): జగపతినగరం శివారున శ్రావణి దుర్గ అమ్మవారి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నదానం నిర్వహించారు. దేవీనవరాత్రుల ముగింపు సందర్భంగా గుడి నిర్మాణ దాతలు చిట్టిబోయిన సూర్యనారాయణ, తలుపులమ్మ దంపతులు, కుటుంబీకుల సహకారంతో అన్నదానం చేశారు. అమ్మవారిని భక్తులు దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.

టీడీపీ బలోపేతానికి సమష్టిగా కృషి



టీడీపీలో చేరిన కార్యకర్తలతో యనమల

తుని రూరల్, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. తేటగుంట టీడీపీ క్యాంపు కార్యాలయంలో తొండంగి మండలం వాకదారిపేట గ్రామం నుంచి వైసీపీకి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలోకి చేరారు. వారికి యనమల పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా యనమల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో చేరడం అభినందనీయమన్నారు. టీడీపీలో చేరిన కార్యకర్తలందరూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో తొం డంగి మండల నాయకులు యనమల రాజేష్, పేకేటి దారకొండ, పేకేటి యతిమాని, పేకేటి రాజేష్, పేకేటి సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

కుమ్మరి వృత్తిదారుల మట్టి సమస్యను పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న చైర్మన్ ఈశ్వర్, డైరెక్టర్ సత్యనారాయణ

ప్రత్తిపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని కుమ్మరి శాలివాహన వృత్తిదారుల ఎదుర్కొంటున్న మట్టి సమస్యను పరిష్కరించాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను సోమవారం రాత్రి ఏపీ కుమ్మరి శాలివాన సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ పేరేపి ఈశ్వర్ కోరారు. పెద్ద శంకర్లపూడి టీడీపీ కార్యా లయానికి వెళ్లి ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసారు. కుండల తయారీ కార్మికులు ట్రాక్టర్ మట్టి రూ.7వేలకు కొనుగోలు చేసుకోవాల్సి వస్తుందని, మట్టిని ఉచితంగా మంజూరుకు ప్రభుత్వం జీవో కూడా జారీ చేసిందని చైర్మన్ ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యేను ఈశ్వర్ శాలువాతో కప్పి సన్మానించగా, కార్పొ రేషన్ చైర్మన్, డైరెక్టర్ భీమా బత్తుల సత్యనా రాయణను ఎమ్మెల్యే శాలువాతో కప్పి సన్మానించారు.

పీడీ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

తొండంగి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న ఫిజికల్ డైరెక్టర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ మెహర్ తెలిపారు. పీజీలో 55శాతం మార్కులతో ఎంఫిల్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. ఈనెల16లోపు పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో దరఖాస్తులు అందించాలని ఆయన కోరారు.

చదువుకున్నచోటే టీచర్ ఉద్యోగం



ప్రత్తిపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): చింతలూరు గ్రామానికి చెందిన పంద్రాడ అపర్ణ డీఎస్సీ పరీక్షలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో 69వ ర్యాంకు సాధించింది. తాను చదువుకున్న చింతలూరు ప్రభుత్వ పాఠశాలలోనే సోమవారం అపర్ణ టీచర్‌గా విధుల్లో చేరింది. చింతలూరులోనే టీచర్‌గా పోస్టింగ్ రావడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. అపర్ణను ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలకు రూ.25 వేలు వితరణ

ఏలేశ్వరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సౌండ్ బాక్సుల ఏర్పాటు నిమిత్తం కౌన్సిలర్ సుంకర హైమావతి, మాజీ కౌన్సిలర్ సుంకర రాంబాబు రూ.25వేల నగదును ప్రధానోపాధ్యాయులు తులసి, ఉపాధ్యాయులు చినబాబుకు అందజేశారు. నూతనంగా చేరిన మంది ఉపా ధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ

ఏలేశ్వరం, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో బీపీ పరికరం, రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. సోమవారం తెలగా కాపు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఉద్దగిరి సోమరాజు సహాయంతో ఆసుపత్రికి బీపీ పరికరం, రోగులకు రొట్టెలు, పాల, పండ్లు అందజేశారు.

జ్యోతుల నవీన్ పరామర్శ



చంటికి నివాళులర్పిస్తున్న జ్యోతుల నవీన్, కూటమి నాయకులు

జగ్గంపేట, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్య క్షుడు అడబాల వెంకటేశ్వరరావు తండ్రి, సీనియర్ టీడీపీ నాయకుడు అడ బాల ముసలయ్య(చంటి) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. వెంకటేశ్వరరావును సోమవారం టీడీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్, జగ్గంపేట మండలా ధ్యక్షుడు జీను మణిబాబు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పోతుల మోహనరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జనపరెడ్డి బాబు, దేవరపల్లి మూర్తి, భూపాలపట్నం ప్రసాద్, మునిరెడ్డి నాగేశ్వరరావు,గండేపల్లి ఎంపీపీ చలగళ్ళ దొరబాబు పరామర్శించారు.

తుమ్మలపల్లి రమేష్ పరామర్శ



జగ్గంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో డాక్టర్ గోలి శ్రీరాములు సతీమణి ఇటీవల మృతిచెందారు. శ్రీరాములును సోమవారం జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ పరామర్శించారు. ఆయన వెంట జగ్గంపేట మండలాధ్యక్షుడు మరిసే రామకృష్ణ, ఎంపీటీసీ దొడ్డా శ్రీను, డ్రిల్ మాస్టర్ శ్రీను, బీజేపీ వరాల బాబు, కరటూరి శ్రీను, కురుమల్ల నాగేశ్వరరావు, సాయి ఉన్నారు.



అన్నక్యాంటీన్లో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే నెహ్రూ

అన్నక్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

జగ్గంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాకినాడ రోడ్డులోని ఎన్టీఆర్ స్మారక మందిరం వద్ద అన్న క్యాంటీన్‌లో సోమవారం జగ్గంపేటకు చెందిన సాయిరాం స్టీల్స్ అధినేత గుణ్ణం వెంకటేశ్వరరావు ఆర్థిక సహాయంతో పేదలకు అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ హాజరై పేదలకు అన్నం వడ్డించారు. కార్యక్రమంలో ఎస్‌ఐఎస్ అప్పలరాజు, కె.కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నెహ్రూను కలిసిన అచ్చన్నదొర

జగ్గంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని గోకవరం మండలం తంటికొండ వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా బదిరెడ్డి అచ్చన్నదొరను నియమిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. సోమవారం జగ్గంపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌ను కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. కార్యక్రమంలో దాసరి సీతారామకృష్ణ, మలిరెడ్డి సిరి, గోకవరం టౌన్ టీడీపీ అధ్యక్షుడు పైలా శ్రీను, తంటికొండ దేవస్థానం బోర్డు సభ్యులు బొట్టా రామకృష్ణ, చప్పిడి వెంటరాజు, చింతల నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సీతానగరంలో రైతులకు వివరిస్తున్న డాక్టర్ సీతారామ శర్మ

సేంద్రియ ఎరువులపై అవగాహన

జగ్గంపేట రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతానగరంలో పెద్దాపురం ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఏ.సీతారామ శర్మ జీవన ఎరువుల ప్రాముఖ్యతపై రైతులకు వివరించారు. ఎరువులు వాడే విధానం, వాడకం వల్ల లాభాలు వివరించి రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి జీవన ఎరువులను వాడుకోవాలని రైతులకు ఆయన సూచించారు. జగ్గంపేట సహాయ వ్యవసాయ సంచాలకులు జి.శ్రీనివాస్ మాట్లాడుతూ రసాయన ఎరువులకు బదులుగా నానో యూరియా, సేంద్రియ ఎరువులను వాడుకోవాలని సూచించారు. పంట నమోదు తప్పనిసరిగా ప్రతి రైతు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, పలువురు రైతులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో జీఎస్టీ అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సత్యప్రభ. పక్క చిత్రంలో కోటనందూరులో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జీఎస్టీ తగ్గుదలతో పేద వర్గాలకు ఊరట

ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గుదలతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఊరట లభించిందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ తెలిపారు. ప్రత్తిపాడులో సోమవారం కూటమి నాయకులతో కలిసి జీఎస్టీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జీఎస్టీ తగ్గుదల వల్ల నిత్యావసర వస్తువులతో పాటు ఎలక్ట్రానిక్ ఉపకరణాల వంటి వస్తువులపై ధరలు బాగా తగ్గాయన్నారు. కార్యక్రమంలో ఖాదీ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు, కూటమి నాయకులు యాళ్ళ జగదీష్, విశ్వేశ్వరరావు, ఇళ్ళ అప్పారావు, అమరాది వెంకట్రావు, మదినే దొరబాబు, పోలిశెట్టి శ్రీను, గ్రామ కార్యదర్శి జ్యోతుల పద్మరాజు, నెల్లిపాక నాగు, వర్తక సంఘం అధ్యక్షుడు అనంతపల్లి శ్రీను, కనపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఒమ్మంగిలో సుంకర భవాని ఏర్పాటు చేసిన సంఘం డెయిరీ పంపిణీ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మాజీ ఎంపీపీ సత్యంశెట్టి సీతారాం, గ్రామపెద్దలు రామిశెట్టి మునిసీబు, రామిశెట్టి రమేష్, అమరాది వెంకట్రావు, సుంకర సోమరాజు, కొప్పన రాజబాబు, రామిశెట్టి నాని పాల్గొన్నారు.

జీఎస్టీపై బైక్ ర్యాలీ

కోటనందూరు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సూపర్ సేవింగ్స్ వల్ల ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందని ఎంపీడీవో వెంకట నారాయణ తెలిపారు. సోమవారం కోటనందూరు మండల పరిషత్ కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ నిర్వహించి ప్రధాన రహదారుల గుండా ప్రచారం చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ప్రత్తిపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): కంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రత్తిపాడు జడ్జి లంకా గోపినాథ్ చెప్పారు. స్థానిక కోర్టు వద్ద సోమవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, మాజీ అధ్యక్షుడు చలంకూరి రామకృష్ణ, బుగతా శివ, సీనియర్ న్యాయవాదులు ఆడారి సుగుణ, బి.మధుబాబు, రాయి శ్రీనివాసరావు, అవసరాల దేవి, మర్రి రత్నకుమారి, పోతుల జోగేష్, కలవపల్లి సుజన, మాదాల మంజూషా, రెడ్నం వెంకటరెడ్డి, అచ్యుత రామారావు, వెంకట్రాజు, లక్ష్మి ప్రసన్న, బెహరా లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.



కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన దృశ్యం

ఆకట్టుకున్న మాయలేడి కళా ప్రదర్శన

ప్రత్తిపాడు, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరంలో గౌరీశంకర్ల వార్షిక మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక కళాకారులు మాయలేడి కళాప్రదర్శనను నిర్వహించారు. సీతారామ వనవాసంలో రావణుడు సోదరి సూర్పణక మాయలేడిగా సీతారాముల వద్దకు వచ్చే ఘట్టాన్ని ఇతివృత్తంగా ప్రదర్శన జరిగింది. శ్రీరాముడుగా బలిజసుబ్రహ్మణ్యం, లక్ష్మణుడుగా మట్టా లక్ష్మణరావు, సీతగా సింగిరెడ్డి రాంబాబు నటించారు.

విధుల్లో చేరిన నూతన టీచర్లు

గండేపల్లి, అక్టోబరు 13(ఆంధ్రజ్యోతి): డీఎస్సీలో విజయం సాధించిన కొత్త టీచర్లు సోమవారం తమకు కేటాయించిన పాఠశాలల్లో విధుల్లోకి చేరారు. మండలంలోని 14 మంది నూతన ఉపాధ్యాయులు వివిధ పాఠశాలకు వెళ్లారు. ఎంఈవోకు నూతన టీచర్లు రిపోర్టు చేశారు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

ఇర్రిపాకలో ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలు

జగ్గంపేట, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం (ఆర్ఎస్ఎస్) శతాబ్ది ఉత్సవాలు జగ్గంపేట మండలం ఇర్రిపాకలో జరిగాయి. నియోజకవర్గస్థాయిలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ ధర్మ పరిషత్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి హాజరై ప్రసంగించారు. దేశంలోనే అతిపెద్ద సంస్థ అని ఎంతో మంది మహనీయులు కుటుంబాలను కూడా వదులుకొని ఆర్ఎస్ఎస్‌కి సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో ఏనుగు సుబ్రహ్మణ్యం, కోరుమిల్లి నాగేశ్వరరావు, నాగం శ్రీనివాస్, వి.రాఘవరావు, బండారు అనిల్ కుమార్, గంగ శివ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

'ఈకేవైసీ తప్పనిసరి'

శంఖవరం, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పనులు నిర్వహించే ప్రతీ శ్రామికుడు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఉపాధి ఏపీడీ పి.జగదాంబ తెలిపారు. కేంద్ర ప్రభుత్వ నూతన మార్గదర్శకాల్లో భాగంగా గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్‌కు జాబ్‌కార్డ్ అందిస్తే ఈకేవైసీ చేస్తారని తెలిపారు. మండలంలో 18,403 జాబ్‌కార్డులకు ఇప్పటి వరకూ 7,265 శ్రామికులు మాత్రమే ఈకేవైసీ చేయించుకున్నారని, వలస వెళ్లినవారు వెంటనే చేయించుకోవాలని ఆయన కోరారు.

'ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటం'

మాజీ మంత్రి దాడిశెట్టి రాజా

తుని రూరల్, అక్టోబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల ప్రాణాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా ఆరోపించారు. కల్తీ మద్యానికి ఆంధ్రప్రదేశ్ కేరాఫ్‌గా మారిందన్నారు. కల్తీ మద్యం వ్యవహారంపై వైసీపీ ఆందోళనలో భాగంగా సోమవారం తునిలోని ఎక్సైజ్ సీఐ కార్యాలయం వద్ద రాజా ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు ధర్నా జరిపారు. కల్తీ మద్యం వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ సీఐ పట్టాభి చౌదరికి ఆయన వినతిపత్రం అందజేశారు. వైసీపీ సీనియర్ నేత యనమల కృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.